ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

గురువారం 19 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 153 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ట్రంప్ చైనా పర్యటన

రష్యా, చైనాలతో త్రైపాక్షిక చర్చలు

పుతిన్‌తో ట్రంప్ భేటీకి క్రెమ్లిన్ సంకేతాలు

ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు.. వాణిజ్యం, ఏఐపై చర్చలు

కిమ్ జోంగ్ ఉన్‌తోనూ సమావేశమయ్యే అవకాశం

2





ఆయుష్మాన్ ఆరోగ్య ప్యాకేజీల సంఖ్య

భారీగా పెంపు

ప్రస్తుతమున్న 23 నుంచి 112కు పెంచాలని ప్రతిపాదన

మోదీ సర్కార్ కీలక నిర్ణయం

2

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి

అధిక ప్రాధాన్యత

విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం... సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికిపైగా ఖర్చు

దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు: సీఎం రేవంత్‌రెడ్డి

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రితో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ సమావేశమైంది. కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే నేతృత్వంలో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

-హైదరాబాద్, నవంబర్ 18 (సింగిడి)



రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తీసుకుంటున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి వివరించారు.శాసనసభ స్పీకర్ పదవితో పాటు మంత్రివర్గంలోనూ దళితులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, వివిధ కార్పొరేషన్లలోనూ వారికి అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. వందేళ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా దళితుడికి వీసీగా అవకాశం కల్పించామని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీలలోనూ ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా అవకాశం కల్పించినట్లు వివరించారు.

2

నక్సలిజం నిర్మూలన తరహాలోనే

డ్రగ్స్ నియంత్రణకు కృషి

యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యం

మంత్రులు, ఉన్నతాధికారులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం

పేదరికం తగ్గింపు, సంక్షేమ పథకాలపై మంత్రిమండలి సమీక్ష



దేశ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని భావిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. నక్సలిజం, వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టడంలో ప్రభుత్వం సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మాదకద్రవ్యాలపై కూడా అదే స్థాయిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ భేటీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. కేంద్ర మంత్రులతో పాటు కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సింగిడి)

2

విదేశీ గడ్డ నుంచి భారత్‌పై రాహుల్

మరోసారి విమర్శలు

ఆర్థిక సంక్షోభం దిశగా భారత్ పయనం

నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలతో యువతలో తీవ్ర నిరాశ

ప్రభుత్వంపై యువతలో పెరుగుతున్న అసహనం

ఎన్నికల సంఘం సాయంతోనే ఓటు చోరీ: రాహుల్ గాంధీ

కొలంబియా యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు

విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించడం అలవాటుగా మారింది: బీజేపీ ఎదురుదాడి

2

భారత్ ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశంలో తీవ్ర నిరుద్యోగ సమస్య, విద్యా వ్యవస్థలో లోపాలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సింగిడి)





ఓటు నమోదుకు

మరో అవకాశం

ఎస్ఐఆర్ గడువు మరోసారి పొడిగింపు

2

రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును మరోసారి పొడిగించారు. డిసెంబరు 10తో ముగియాల్సిన ఎస్ఐఆర్ డిసెంబరు 22 వరకు పొడిగించారు. ముసాయిదాలో పేరు లేని అర్హుల ఓటు నమోదుకు మరో అవకాశం కల్పిస్తున్నామని సీఈవో పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు మార్లు పొడిగించారు.

-హైదరాబాద్, నవంబర్ 18 (సింగిడి)

రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు

సింగిల్ డిజిట్ సీట్లే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2

పేద కుటుంబాలకు

‘ఇందిరమ్మ జీవిత బీమా’

గ్రామీణ ఉపాధి కూలీలకు కొండంత అండ

అర్హులైన ప్రతి మహిళకు ఉచితంగా ఇందిరమ్మ చీర

లబ్ధిదారుల జాబితా నుంచి ఎవరినీ తొలగించొద్దు

పథకాల అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌కు ఆదేశం

నేడు సిద్దిపేట సభలో రెండు పథకాలకు శ్రీకారం: సీఎం రేవంత్‌రెడ్డి

2





ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో

ప్రత్యేక నమోదు కేంద్రాలు

ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు: సీఎస్ సంజయ్ జాజు

రూ.2 లక్షల జీవిత బీమా రూ.5 లక్షలకు పెంపు... నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీతో పాటు అన్ని మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం వివిధ వర్గాలకు అమలవుతున్న బీమా పథకాలను ఇందిరమ్మ కుటుంబ బీమా పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నేతన్నలు, గౌడులు, కార్మికులు, మత్స్యకారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకురావడం ద్వారా రూ.5 లక్షలకు పెంచనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

-హైదరాబాద్, నవంబర్ 18 (సింగిడి)

2

ముంబయిలోనే ప్రధాన కార్యాలయం..

తయారీ, వ్యాపార విస్తరణ తెలంగాణలో

ముంబయి పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

సాంకేతికత, జీసీసీలు, డేటా సెంటర్లు, ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు

డిసెంబరు 7 నుంచి 9 వరకు గ్లోబల్ సమ్మిట్

పెట్టుబడులకు వేగంగా అనుమతులిచ్చే టీజీ-ఐపాస్ విధానం



తెలంగాణను తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముంబయి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ‘మీ ప్రధాన కార్యాలయాన్ని ముంబయిలోనే కొనసాగించండి.. తయారీ, వ్యాపార విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను తెలంగాణలో చేపట్టండి’ అని ఆహ్వానించారు. బుధవారం ముంబయిలోని వర్లీలో ఫోర్ సీజన్స్ హోటల్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026’ రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు.

- ముంబయి, నవంబర్ 18 (సింగిడి)

తెలంగాణ నీటి ప్రయోజనాలను

దెబ్బతీసే కుట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కేటీఆర్ విమర్శలు

నాగార్జునసాగర్ నుంచి 90 టీఎంసీల నీటి మళ్లింపునకు ఏపీ యత్నం

కేఆర్ఎంబీకి వెంటనే ఫిర్యాదు చేయాలని డిమాండ్



2

తెలంగాణ సాగునీటి, తాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా జలాలను మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

-హైదరాబాద్, నవంబర్ 18 (సింగిడి)

విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదు

వచ్చే 6 నెలల విద్యుత్ డిమాండ్‌కు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి: చంద్రబాబు ఆదేశం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై పోలీసుల సహకారంతో కఠిన చర్యలు

డిసెంబర్ నాటికి 10 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యం

రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 పనులు వేగవంతం... విద్యుత్ శాఖపై సీఎం సమీక్ష

2



రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి, అందుకు తగిన ప్రణాళికలను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఆరు నెలల కాలంలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రాష్ట్రంలో ఎలాంటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ రంగంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు.

అమరావతి (సింగిడి)



నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే..

కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల పంపకాలపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి

కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లకే పెద్దపీట వేస్తున్నారని విమర్శ

కొడంగల్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించారన్న మునుగోడు ఎమ్మెల్యే

2

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికి పైగా ఈ వర్గాల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలను కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు రవి, తాహీర్ గావ్, హరీశ్ చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, దగ్గుమల్ల ప్రసాద రావుతో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి గారితో షెడ్యూల్డు కులాలు, తెగల సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ భేటీ అయింది. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే గారితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి గారు వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రులుగా దళితులకు రాజకీయంగా సముచిత అవకాశం కల్పించామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలో అనేక అవకాశాలు కల్పించిన విషయాలను ప్రస్తావించారు. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా దళితుడికి అవకాశం కల్పించామని, ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలలో ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతి చోట ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించామని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలోనూ వారినే ప్రాధాన్యతగా తీసుకున్నామని వివరించారు. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీల కోసం ఖర్చు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేశారు. వర్గీకరణ అమలు చేయడం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి గారిని కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు, తాహీర్ గావ్ గారు, హరీశ్ చంద్ర మీనా గారు, అనిల్ ఫిరోజియా గారు, అరుణ్ కుమార్ గారు, దగ్గుమల్ల ప్రసాద రావు గారితో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ట్రంప్ చైనా పర్యటన

న్యూఢిల్లీ, సింగిడి

రష్యా, చైనాలతో త్రైపాక్షిక చర్చల్లో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్ పర్యటనకు వెళ్లారు. విమానాశ్రయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. రెడ్‌కార్పెట్‌పై నడుచుకుంటూ వస్తున్న ట్రంప్‌కు ఇరువైపులా నిల్చున్న ప్రజలు, చిన్నారులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఒక దేశాధినేతకు చైనాలో ఈ స్థాయిలో ఆహ్వానం పలకడం అరుదుగా జరుగుతుందని భావిస్తున్నారు. గురువారం ఆసియా-పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా ట్రంప్, జిన్‌పింగ్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు, వాణిజ్య సంబంధాలు, కృత్రిమ మేధ (ఏఐ), అణ్వాయుధాలు తదితర కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది.

పుతిన్-ట్రంప్ భేటీ

బుధవారం రాత్రి విందు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సమావేశమయ్యే అవకాశం ఉందని క్రెమ్లిన్ సీనియర్ సహాయకుడు యూరీ ఉషకోవ్ వెల్లడించారు. సదస్సు ముగిసిన అనంతరం కూడా ఇరువురు మరోసారి భేటీ అవుతారని తెలిపారు.

కిమ్‌తోనూ చర్చలకు అవకాశం

మరోవైపు, చైనా పర్యటనలో భాగంగా ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమయ్యే అవకాశం ఉందని ట్రంప్ మంగళవారం వెల్లడించారు.

ఉత్తర కొరియా చేపట్టిన అణ్వాయుధ కార్యక్రమంపై ఆ దేశంతో తిరిగి సంప్రదింపులు ప్రారంభించాలని అమెరికా భావిస్తోందని తెలిపారు.

పేద కుటుంబాలకు
'ఇందిరమ్మ జీవిత బీమా'

పథకాల అమలు కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో వెంటనే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

ప్రతి అర్హ మహిళకు ఉచితంగా చీర

రాష్ట్రంలోని అర్హులైన పేద మహిళలందరికీ పండుగ కానుకగా ఉచితంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని కూడా ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందేలా పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

జిల్లాలకు చీరల తరలింపు

గోదాముల్లో ఉన్న చీరల నిల్వలను తక్షణమే అన్ని జిల్లా కేంద్రాలకు తరలించాలని సీఎం ఆదేశించారు.

ముంబయిలోనే ప్రధాన కార్యాలయం..
తయారీ, వ్యాపార విస్తరణ తెలంగాణలో

ముంబయి నుంచి పెట్టుబడులను తరలించుకురావాలన్నది తమ ఉద్దేశం కాదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అక్కడి సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను కొనసాగిస్తూనే తెలంగాణలో ఉత్పత్తి, వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకునేందుకు అనువైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రెండు ప్రాంతాల మధ్య ఉన్న వాణిజ్య, వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణకు చెందిన కార్మికులు, చేతివృత్తులవారు, వ్యాపారవేత్తలు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని మంత్రి గుర్తుచేశారు. రెండు ప్రాంతాల మధ్య దశాబ్దాలుగా వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. శతాబ్దం క్రితం తెలంగాణ ప్రజలు ముంబయి భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు ఇక్కడికి వచ్చారని, ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో
ప్రత్యేక నమోదు కేంద్రాలు

ప్రతి అర్హత ఉన్న కుటుంబంలోని సభ్యులందరూ పథకంలో నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. పథకం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. దాదాపు నెల రోజుల పాటు కొనసాగనున్న నమోదు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, పౌర సరఫరాల కమిషనర్ నాగిరెడ్డి, కార్మిక శాఖ కార్యదర్శి హరిచందన, ఐటీ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును మరోసారి పొడిగించారు. డిసెంబరు 10తో ముగియాల్సిన ఎస్ఐఆర్ డిసెంబరు 22 వరకు పొడిగించారు. ముసాయిదాలో పేరు లేని అర్హుల ఓటు నమోదుకు మరో అవకాశం కల్పిస్తున్నామని సీఈవో పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు మార్లు పొడిగించారు.

డిసెంబరు 22 వరకు పొడిగింపు

రాష్ట్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల కమిషన్ మరోసారి పొడిగించింది. ఈనెల 30తో ముగియాల్సిన ఎస్ఐఆర్ ప్రక్రియను డిసెంబరు 22 వరకు పొడిగించింది. ఆగస్టు 17న ప్రకటించిన ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది.

తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో

ముసాయిదా జాబితా నుంచి ఓటు తొలగించిన వారికి ఈనెల 30 వరకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి డిసెంబరు 10 వరకు వాటిని పరిష్కరిస్తారు.

ఆయుష్మాన్ ఆరోగ్య
ప్యాకేజీల సంఖ్య భారీగా పెంపు

న్యూఢిల్లీ, నవంబర్ 18 (సింగిడి)

ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన చికిత్సల పరిధిని గణనీయంగా పెంచాలని మోదీ సర్కార్ యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ప్రస్తుతమున్న 23 నుంచి 112కు పెంచాలని ప్రతిపాదించినట్లు నేషనల్ హెల్త్ అథారిటీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదిత విస్తరణ ప్రధానంగా సాధారణ అనారోగ్య సమస్యలు, సర్జరీలపై దృష్టి సారించనుందని వెల్లడించాయి. ఈ అనారోగ్య సమస్యలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ ఆస్పత్రుల్లో సమర్థవంతంగా చికిత్స అందించవచ్చని పేర్కొన్నాయి. ఆరోగ్య సంరక్షణ సేవలను లబ్ధిదారులకు మరింత చేరువ చేయడం, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం కోసం ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ప్రస్తుతమున్న 23 నుంచి 112కు పెంచాలని కేంద్రం యోచిస్తున్నట్లు నేషనల్ హెల్త్ అథారిటీ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరికరాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బందితోనే వీటిలో చాలా చికిత్సలను అందించవచ్చని వెల్లడించాయి.

విదేశీ గడ్డ నుంచి భారత్‌పై రాహుల్
మరోసారి విమర్శలు

ప్రభుత్వం అంగీకరించకపోయినా, మీడియా ఈ అంశాలను పక్కన పెట్టినా భారత్ ఆర్థిక విపత్తు అంచున ఉందనేది వాస్తవమని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

యువతకు భవిష్యత్తుపై భరోసా లేదు

దేశంలోని లక్షలాది మంది మధ్యతరగతి యువత తీవ్ర నిరాశలో ఉన్నారని రాహుల్ అన్నారు. సరైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులకు దేశంలో తమ భవిష్యత్తుపై భరోసా కనిపించడం లేదని పేర్కొన్నారు. నిరుద్యోగం, పరిమిత ఉద్యోగ అవకాశాలు, విద్యా వ్యవస్థలో లోపాలు విస్మరించలేని తీవ్రమైన సవాళ్లని స్పష్టం చేశారు. ఈ పరిస్థితులే ప్రభుత్వంపై యువతలో అసహనానికి కారణమవుతున్నాయని వ్యాఖ్యానించారు.

విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం

దేశంలోని సమస్యలపై తాము అధ్యయనం చేస్తున్నామని రాహుల్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు అవసరమైన అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. ఉద్యోగాలు లభించకపోవడం, విద్యా వ్యవస్థలో లోపాలు యువతలో ఆందోళనను పెంచుతున్నాయని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు యువత ఏకమవుతోందని చెప్పారు. ఎన్నికల సంఘం సాయంతో ఓటు చోరీ ఎన్నికల సంఘం సహకారంతోనే అధికార బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 2024లో ఓటు వేసిన 14 కోట్ల మంది ప్రజలను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలను ఎలా చెల్లుబాటు అయ్యేవిగా పరిగణించగలమని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈ అంశంపై సంఘం మౌనం వహిస్తోందని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకొస్తేనే ఓటు చోరీ సమస్యను పూర్తిగా నిర్మూలించగలమని రాహుల్ అన్నారు. భారత ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని నిరూపించేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని వెల్లడించారు. ప్రభుత్వంలోని కీలక అధికారులే ఈ సమాచారాన్ని అందించారని, అయితే ప్రభుత్వానికి భయపడి వారు బహిరంగంగా మాట్లాడటం లేదని వ్యాఖ్యానించారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించడం ఆయనకు అలవాటుగా మారిపోయిందని విమర్శించింది. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని మండిపడింది.

నక్సలిజం నిర్మూలన తరహాలోనే
డ్రగ్స్ నియంత్రణకు కృషి

సుమారు 40 నిమిషాల పాటు మాట్లాడిన మోదీ.. దేశ భవిష్యత్తు అయిన పిల్లలు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలని ఆకాంక్షించారు. 'నషా ముక్త్ భారత్' సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. వామపక్ష తీవ్రవాదం, నక్సల్స్ హింసను నియంత్రించేందుకు ప్రభుత్వం ఏ స్థాయిలో పట్టుదలతో ప్రయత్నాలు చేసిందో.. అదే విధంగా మాదకద్రవ్యాల సమస్యను కూడా ఎదుర్కోవాలని సూచించారు. ఈ ఏడాది ఆగస్టులోనే 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే.

పేదరికం తగ్గింపుపై ప్రత్యేక ప్రజెంటేషన్

దేశంలో తీవ్ర పేదరికం గణనీయంగా తగ్గిన అంశంపైనా మంత్రిమండలి సమావేశంలో చర్చ జరిగింది. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికకు సంబంధించిన వివరాలను ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అనురాధ ఠాకూర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటీవలి సంవత్సరాల్లో దేశ ఆర్థిక వృద్ధి, ప్రభుత్వ మూలధన వ్యయం, మౌలిక సదుపాయాల విస్తరణ పేదరికం తగ్గడానికి దోహదపడ్డాయని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చేపట్టిన చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. అనంతరం ఆరుగురికి పైగా వివిధ శాఖల కార్యదర్శులు పేదరిక నిర్మూలనకు సంబంధించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడేందుకు అవకాశం కలిగిందని వారు వివరించినట్లు తెలుస్తోంది.

సంక్షేమ పథకాల ప్రభావంపై సమీక్ష

ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి కేంద్ర పథకాల ప్రభావాన్ని అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. గ్రామీణ ఉపాధి, వ్యవసాయం, టెలికాం, ఆర్థిక సేవలను సామాన్యులకు మరింత చేరువ చేసేందుకు చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు.

నక్సలిజంపై హోంశాఖ నివేదిక

మరోవైపు, వామపక్ష తీవ్రవాదం, నక్సల్స్ హింసను అరికట్టడంలో సాధించిన పురోగతిపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమస్యను నియంత్రించేందుకు ప్రభుత్వం అమలు చేసిన చర్యలు, సాధించిన ఫలితాలను సమావేశంలో వివరించారు.

నిధులు ఇవ్వకుంటే కురుక్షేత్రమే..

మునుగోడు, నవంబర్ 18 (సింగిడి)

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీ సర్కారుపైనే తీవ్ర అసంతృప్తి స్వరం వినిపిస్తూ కాంగ్రెస్‌లో మరోసారి ప్రకంపనలకు తెరలేపారు. నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల మంజూరులో ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్రమైన పక్షపాతం చూపుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమస్యలను పరిష్కరించి రావలసిన వాటా నిధులు కేటాయించకపోతే రాబోయే రోజుల్లో సర్కారుతో 'కురుక్షేత్రం' తప్పదని తేల్చిచెప్పారు. మునుగోడులో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, పాలన తీరుపై ఘాటు విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కేవలం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకే నిధులు కుమ్మరించారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ అదే తరహా సంస్కృతి కొనసాగుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన కొడంగల్‌పై, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్‌పై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరపై మాత్రమే ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు తీసుకెళ్తున్న ప్రభుత్వం.. ఫ్లోరైడ్ బారినపడి ఏళ్ల తరబడి అల్లాడుతున్న మునుగోడు ప్రజల కోసం చెరువులు, కుంటలను బాగుచేసేందుకు రూ.500 కోట్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పనులు మూడేళ్లుగా పడకేయడంతో నల్గొండ ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నారని రాజగోపాల్ పేర్కొన్నారు. చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి హామీ ఇప్పటికీ అటకెక్కి ఉందని మండిపడ్డారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో వినతిపత్రాలు సమర్పిస్తే బుట్టదాఖలు చేస్తున్నారన్నారు. అదే ప్రజల ముందు ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యల పేరిట నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌కు కేటాయించే నిధులపై నిలదీస్తే 'పండబెట్టి తొక్కుతా' అంటూ మాట్లాడటం ఒక ముఖ్యమంత్రికి తగదని హితవు పలికారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని తేల్చిచెప్పారు.

విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదు



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య కాలంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 18.23 శాతం మేర పెరిగిందని అధికారులు సీఎంకు వివరించారు. ఎల్ నినో వంటి వాతావరణ మార్పుల వల్ల వర్షాకాలంలోనూ అనూహ్యంగా డిమాండ్ పెరిగిందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ఇలాంటి సవాళ్లను ముందే ఊహించి అధిగమించేలా యంత్రాంగం సన్నద్ధం కావాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించడంతో పాటు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు ధరలు తగ్గేలా చూడాలన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు సంస్థలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవాలని, ప్రభుత్వ రంగ ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదని, దీనికి కట్టుబడి విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించాలన్నారు. డిమాండ్, సరఫరా నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు పెరగడంపై ముఖ్యమంత్రి తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. రాగి తీగల కోసం దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలిస్తున్నారని అధికారులు తెలుపగా, ఇలాంటి వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, రైతుల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, పోలీసుల సహకారంతో సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులకు గట్టి గుణపాఠం చెప్పాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు విద్యుత్ రంగంలో రూ.4.20 లక్షల కోట్ల విలువైన 103 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో మరో రూ.2.56 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరినట్లు పేర్కొన్నారు. కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, ఎంవోయూ కుదిరిన ప్రతి ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. రూ.21,838 కోట్లతో చేపట్టనున్న గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం లభిస్తుందని అధికారులు వివరించగా, తక్షణమే టెండర్లు పిలిచి రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను అందుబాటులోకి తేవాలని, పోలవరం పరిసరాల్లో గుర్తించిన 27 అనువైన ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, సాగునీటి ప్రాజెక్టుల కాలువ గట్లపై పెద్దఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 7.42 లక్షల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలపగా, డిసెంబర్ నాటికి నిర్దేశిత 10 లక్షల లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ పథకం కింద చేపట్టిన ప్రాజెక్టుల సివిల్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సింగిల్ డిజిట్ సీట్లే

హైదరాబాద్, నవంబర్ 18 (సింగిడి)

రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సింగిల్ డిజిట్ సీట్లు మాత్రమే వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు..ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పేదల సంక్షేమాన్ని విస్మరించారని మంత్రి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా కల్లూరులో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నాలుగు లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావు లేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు త్వరలో మరో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పేదలు, మహిళలు, వృద్ధులు, అర్హులైన నిరుపేద కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి అన్నారు.

తెలంగాణ నీటి ప్రయోజనాలను
దెబ్బతీసే కుట్ర

ఈ ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉందని ఆరోపించారు. ప్రధాన



సహారా బాధితులను ఆదుకోవాలి

హనుమకొండ ప్రతినిధి (సింగిడి)

నవంబర్18 సహారా బాధితులను ఆదుకోవాలని తెలంగాణ సహారా ఖాతాదారుల, కార్యకర్తల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్డ బాలయ్య అన్నారు. హనుమకొండ లోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల పేద మధ్యతరగతి ప్రజలు భవిష్యత్తులో పిల్లల పెండ్లిలకు, చదువు లకు,గృహ నిర్మాణ లకు,నిత్య అవసరాలకు పనికొస్తాయని కొండంత ఆశతో సహారా ఇండియా సంస్థలు పొదుపు చేసుకుంటే కాలపరిమితి దాటి సంవత్సరాలు గడిచిన సహారా సంస్థ తిరిగి ఇవ్వడంలో విఫల మైందని, సహారా సంస్థ సెబీ కేసు సుప్రీంకోర్టులో 2012 సంవత్సరం నుండి ఇప్పటివరకు కేసు కొనసాగడం వలన ఖాతాదారులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుంది అని, ప్రజలకు న్యాయం చేయాల్సిన కోర్టులు కాలయాపన వలన వేలాదిమంది ఖాతాదారులు మానసిక ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. దేశ జనాభాలో 11% ఉన్న ఖాతాదారుల సమస్యను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరిష్కరించ డంలో పూర్తిగా విఫలమైనాయని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సోషనీయమని అన్నారు. ఈ కార్య క్రమంలో సంఘ ఉపాధ్యక్షులు గుండేటి కుమార్, సహాయ కార్యదర్శి నాగ బండి రాము,వరంగల్ జిల్లా అధ్యక్షుడు డి.నరేందర్ బాబు తదిత రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

కరీంనగర్, నవంబర్18(సింగిడి)

నగరంలోని 50వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్‌కుమార్ బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తానని తెలిపారు. అర్హత ఉండి పింఛన్ రాని వారు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పింఛన్ల మంజూరు చేయించినందుకు లబ్ధిదారులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లింగంపల్లి స్టేజి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి!

కామారెడ్డి నవంబర్ 18(సింగిడి)

కామారెడ్డి: ప్రయాణికుల సౌకర్యార్థం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి–లింగంపల్లి స్టేజి వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని భూంపల్లి గ్రామ పాలక వర్గం, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కామారెడ్డి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు.లింగంపల్లి స్టేజి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగకపోవడంతో భూంపల్లి, లింగంపల్లి, జనగాం, కరట్లపల్లి, తిమ్మాజివాడి, తుక్కుజివాడి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భూంపల్లి సర్పంచ్ గైని శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, నిత్యం ప్రయాణించే ప్రజలు బస్సుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. కామారెడ్డి నుంచి బాన్సు వాడకు, బాన్సువాడ నుంచి కామారెడ్డికి వెళ్లే పలె వెలుగు బస్సులు సైతం లింగంపల్లి స్టేజి వద్ద నిలవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఇప్పటికే గత రెండు వారాలుగా కామారెడ్డి ఆర్టీసీ డీఎం దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లింగంపల్లి స్టేజి వద్ద పలె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఆర్టీసీ అధికా రులను కోరారు. గ్రామస్తుల వినతిపై ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మూర్తి సానుకూలంగా స్పందించారు. లింగంపల్లి స్టేజి వద్ద పలె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా తనవంతు చొరవ తీసుకొని అవసర మైన చర్యలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మక ఐఎస్బిలో కోర్సు పూర్తి చేసిన సిరిసిల్ల వైద్యుడు



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)

సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, నియోనాటాల జిస్ట్, సరయు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ తడుక సాయికుమార్ ప్రతిష్ఠాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐ ఎస్ బి) నిర్వహించిన అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్‌కేర్ (ఎఎంపిహెచ్) విజ యవంతంగా పూర్తి చేశారు. దేశంలో అగ్రగామి బిజినెస్ స్కూల్‌గా, అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు పొందిన ఐ ఎస్ బి, ఫైనాన్షి యల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్ 2026లో ప్రపంచవ్యాప్తంగా 12వ స్థానం, భారతదేశంలో మొదటి స్థానం, ఆసియాలో రెండో స్థానం సాధించడం విశేషం. ఆరోగ్య రంగంలో నాయకత్వ లక్షణాలు, ఆసుపత్రుల నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, వ్యూహాత్మక నిర్ణయాలు, వైద్య సేవల నాణ్యత, ఆధునిక హెల్త్‌కేర్ విధానాలపై అవగాహన పెంపొం దించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యా ప్తంగా వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, హెల్త్‌కేర్ రంగ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 నవంబర్ 14న మొహాలీలోని ఎస్ఐబి క్యాంపస్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధి కారి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికుమార్‌కు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. వైద్య వృత్తిలో నిరంతర అభ్యాసంతోపాటు ఆధునిక హాస్పిటల్ మేనేజ్‌మెంట్, సాంకేతిక పరిజ్ఞానం, నూతన నిర్వహణ పద్ధతులను అనుసంధానం చేసి సిరిసిల్ల ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కోర్సును పూర్తి చేసినట్లు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. పలువురు వైద్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా!

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులందరికీ అవకాశం





కామారెడ్డి నవంబర్ 18 (సింగిడి)

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకా మారెడ్డి: కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆక స్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఇందిరమ్మ కుటుం బ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని అధికారులు సమన్వయంతో, పక డ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.బు ధవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారు లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షిం చారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే ఒక వ్యక్తిని బీమా పరిధిలోకి తీసు కురావాలని సూచించారు. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్ల యితే ఎవరిని బీమా పరిధిలోకి తీసుకోవాల నేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకునే అవకాశం కల్పించాలన్నారు. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందిం చాలని స్పష్టం చేశారు.బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారు లపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక సహాయక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల ఆధారంగా కుటుంబాలను గుర్తించ డంతో పాటు, రేషన్ కార్డుల్లో పేర్లు లేని వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు.బీమా పొందే వ్యక్తి వివరాలు, ఆధార్ ఆధారిత పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నందున వారికి కేటాయించే వాటాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తుల నమోదు, అవసరమైన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ పథకాన్ని గురువారం సిద్దిపేటలో ముఖ్యమంత్రి ప్రారం భించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)ను నోడల్ అధికారిగా నియ మించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపడతామని వివరిం చారు.పథకం విజయవంతానికి ప్రజాప్రతిని ధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, వార్డు అధికారు లకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక కార్యా చరణ విధానంపై ఇప్పటికే శిక్షణ అందించి నట్లు తెలిపారు. నమోదు ప్రక్రియ సులభతరం చేసేందుకు ఎంపీడీవోలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక లాగిన్ సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్ల డించారు.జిల్లాలోని ప్రతి నమోదు శిబిరంలో ఇంటర్నెట్ కనెక్షన్, ప్రింటర్, స్కానర్ వంటి సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపంచా యతీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి అర్హ కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, ఒక్క అర్హ కుటుంబం కూడా మిగిలిపోకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, సీపీఓ జి. రఘునందన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.. మంత్రి గడ్డం వివేక్

సిద్దిపేట ప్రతినిధి,
నవంబరు 18, (సింగిడి):



ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన సిద్దిపేటలో పర్యటించి సీఎం సభా ప్రాంగణాన్ని సంద ర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి అధికా రులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా సిద్దిపే టకు చేరుకుంటారని తెలిపారు. ము స్తాబాద్ చౌరస్తాలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకుంటారని వివరిం చారు. అనంతరం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించడంతోపాటు ఇందిరమ్మ చీరల పంపిణీ, జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడ తారని పేర్కొన్నారు.బహిరంగ సభలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తా రని చెప్పారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతిని ధులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశిం చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటంతోపాటు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు అవసర మైన సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు తూముకుంట్ల ఆంక్ష రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు..

ఏసీబీ వలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్

హత్య కేసులో నిందితులను గట్టెక్కిం చేందుకు రూ.2 లక్షలకు డీల్
రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రవీందర్
కరీంనగర్ ఏసీబీ అధికారుల పక్కా ఆపరేషన్

పెద్దపల్లి ప్రతినిధి,
నవంబర్ 18 (సింగిడి):



బాధితులకు న్యాయం చేకూర్చాల్సిన బాధ్య తాయుతమైన స్థానంలో ఉన్న ఓ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసులకు కక్కుర్తి పడి నింది తులకే అండగా నిలిచేందుకు సిద్ధమ య్యారు. హత్య కేసు విచారణలో నిందిత లకు అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన న్యాయవర్గాల్లో కలకలం రేపింది.వివరాలు ఇలా ఉన్నాయి ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో 2023వ సంవత్స రంలో తలెత్తిన ఓ భూవివాదం తీవ్ర ఘర్షణకు దారితీసి, ఒకరి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు నిందితులపై హత్య కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, ఈ కేసులో నిందితులకు శిక్ష పడకుండా చూసి, వారికి అనుకూలంగా వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు.

వ్యూహాత్మకంగా వల పన్ని..

లంచం డిమాండ్‌పై సమాచారం అందుకున్న కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగింది. ముందస్తు ఒప్పందం ప్రకారం బుధవారం రూ.1.50 లక్షల నగదును రవీందర్ తీసు కుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా ఓ పబ్లిక్ ప్రాసిక్యూ టర్ లంచం తీసుకుంటూ పట్టుబడటం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రతీ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట ప్రతినిధి
నవంబర్ 18, (సింగిడి):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేయనున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్నీ అర్హులైన కుటుంబా లకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు.రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడం కోసం ప్రభుత్వ లక్ష్యంగా సిద్దిపేట వేదికగా సభ లో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టబోతున్నారని, ఈ నెల 19వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కాబోతోంది. ఈ పథకానికి సంబంధించి ప్రతి రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఇంటి పెద్దగా ఉన్న వ్యక్తి లేదా కుటుంబం తరఫున బీమా కోసం ఎంపిక చేసుకున్న వ్యక్తి వివరాలను నమోదు చేసుకోవాలని దరిపల్లి చంద్రం సూచించారు. దరఖాస్తు ప్రక్రియ కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు, నామినీ వివరాలు వంటి అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో లేదా ప్రభుత్వం సూచించిన కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ప్రజలకు తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే ఉద్దేశంతో రూపొందించ బడిందని, ప్రతి అర్హత గల కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాల మండలాల గ్రామాల ప్రజలు ఈ పథకంపై అవగాహన కలిగి ఉండి, అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజ నాన్ని కోల్పోకూడదని దరిపల్లి చంద్రం విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ జెండా దిమ్మె కూల్చివేత దుర్మార్గమైన చర్య

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జి వి రామకృష్ణారావు
మాకొండూర్, నవంబర్18(సింగిడి)



మండల పరిధిలోని నిజాయితిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెను కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన, అప్రజాస్వామిక చర్య అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జి వి రామకృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదర ణను, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడటాన్ని జీర్ణించుకోలేక కొందరు ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడటం వారి అసహనానికి నిదర్శన మని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ శ్రేణు లందరూ ఐక్యంగా ఉండాలని, పార్టీ బలో పేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపుని చ్చారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు ఏమాత్రం భయపడకుండా మరింత ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. బీఆర్ఎస్ జెండా దిమ్మెను కూల్చివేయగలరేమో కానీ, ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న కేసీఆర్ పట్ల ఉన్న అభిమానం, ఆదరణను మాత్రం ఎవరూ చెరిపివేయలేరు.బీఆర్ఎస్ అంటే కేవలం ఒక జెండా మాత్రమే కాదు అది ప్రజల నమ్మకం, ఉద్యమ స్ఫూర్తి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని స్పష్టం చేశారు.ఇలాంటి బెదిరింపులకు, కక్షపూరిత చర్యలకు బీఆర్ఎస్ భయపడ దని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన తమ పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, పార్టీ నాయకులు శాతరాజు యాదగిరి, నెల్లి మురళి,ఆడెపు రమేష్, గుమ్మడి మధు, గడ్డి కుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యాంటీబయోటిక్స్‌ను ఇష్టానుసారంగా వాడొద్దు!

ఏఎంఆర్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి
జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కామారెడ్డి, నవంబర్ 18:(సింగిడి)



యాంటీబయాటిక్స్‌తో పాటు యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ మందులను వైద్యుల సూచన మేరకే వినియోగించాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీ హెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. మందులను ఇష్టానుసా రంగా వినియోగించడం వల్ల సూక్ష్మజీవుల్లో ఔషధ నిరోధకత పెరిగి భవిష్యత్తులో ప్రాణాంతక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రపంచ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్స వాలు–2026 సందర్భంగా బుధవారం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం, అవసరం లేకున్నా మందులు వినియోగించడం, వైద్యులు సూచించిన చికిత్సను మధ్యలోనే నిలిపివే యడం లేదా సొంత నిర్ణయంతో మార్చుకోవడం వల్ల యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. వైద్యులు సూచించిన మందులను వారి ఆదేశాల ప్రకారమే వాడాలని, ఇతరులకు సూచించిన మందులను తీసుకోకూడదని స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు స్వీయ వైద్యం చేసుకోకుండా తప్పనిసరిగా వైద్యులను సంప్ర దించాలని సూచించారు.ఏఎంఆర్ సమస్య కేవలం మానవ ఆరోగ్యానికే పరిమితం కాదని, జంతువులు, వ్యవసాయం, పర్యావరణంపై కూడా ప్రభావం చూపు తుందని వివరించారు. మానవులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యాన్ని సమన్వయంతో కాపాడుకో వడం ద్వారా మాత్రమే ఈ సమస్యను సమర్థవం తంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు. మందుల బాధ్యతాయుత వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అనంతరం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు ఆసుపత్రి ప్రాంగణం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ "ఏఎంఆర్‌ను అరికడదాం.. ప్రాణాలను కాపాడుదాం", "వన్ హెల్త్ – వన్ యాక్షన్" అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్ర మంలో ఆసుపత్రి ఆర్ఎంఓ, హెచ్ఓడీ డాక్టర్ భవాని, ఇన్ఫెక్షన్ కంట్రోల్ సిబ్బంది, వైద్యులు, రవీందర్ గౌడ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 18 (సింగిడి)



జిల్లాలో తంగళ్ళపల్లి మండలం సారంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులే ఒక రోజు ఉపా ధ్యాయులుగా, అధికారులుగా బాధ్యతలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు . ఈ సందర్భంగా విద్యార్థి గుగ్గిళ్ల శ్రీఖర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) గా, నల్లోండ చరణ్ ప్రధానోపాధ్యాయుడు (హెచ్.ఎం) గా, తోకల అఖిల్ శ్రియాన్స్ పీఈటీగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈవో వ్యవహరించిన గుగ్గిళ్ల శ్రీఖర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పని తీరు పై ఆరా తీసారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీ లించారు. పాఠశాలలో కొద్దిసేపు తన గొంతుతో పాటల పాడి విద్యార్థులల్లో, పాఠశాల ఉపాధ్యాయు లలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులందరూ పాఠ శాలకు ప్రతిరోజు హాజరయ్యే విధంగా చర్యలు తీసు కోవాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు సంఘం రాజేష్ మాట్లాడుతూ, ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల నిర్వహణ, తర గతుల బోధన, హాజరు నమోదు, క్రీడా కార్యక్రమాలు తదితర బాధ్యతలను విద్యార్థులే స్వయంగా నిర్వ హించారని పాఠశాలను ఎలా నడపాలి, బాధ్యత అంటే ఏమిటో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించ డమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని, విద్యార్థులు అద్భుతంగా బాధ్యతలు నిర్వహించారని వారు కొని య

Editorial

ఎడిటోరియల్

ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత పట్ల అవగాహన కలిగి ఉన్నామా!

(18-24 నలంబర్: ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత అవగాహన వారోత్సవాలు"సందర్భంగా)

అతి ప్రధానమైన 10 ప్రజారోగ్య సమస్యల్లో "ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)" లేదా "ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత"ను ఒకటిగా గుర్తించడంతో 2005 నుంచి ఐరాస ప్రతి ఏట 18-24 నవంబర్ రోజుల్లో "వరల్డ్ ఆంటీ-మైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్" లేదా "ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు" పాటించుట ఆనవాయితీగా మారింది. బాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులు లాంటి సూక్ష్మజీవులు కలిగించే సాంక్రమిక వ్యాధులను త్వరగా, సమర్థవంతంగా నయం చేయడానికి ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వాడుట అలవాటు అయ్యింది. కాలానుగుణంగా సూక్ష్మజీవుల్లో వస్తున్న మార్పులతో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పట్ల సూక్ష్మజీవులు నిరోధకతను పెంచుకొని, ఆ ఔషధాలకు రోగ కారక సూక్ష్మజీవులు లొంగకుండా మొండికేయడంతో అంటువ్యాధుల చికిత్సలకు అవాంతరాలు ఏర్పడి ప్రాణాంతక స్థితులకు చేరడంతో పాటు మరో "నిశ్శబ్ద విపత్తు" ఏర్పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదకర విపత్తు వల్ల ఏడాదికి 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, ఈ సంఖ్య 2050 వరకు 10 మిలియన్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఏఎంఆర్ సమస్య ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 90 శాతం వరకు విస్తరించిందని నిర్ధారణ అవుతున్నది.

ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరగడానికి కారణాలు:

ఏఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణాలుగా విచక్షణారహితంగా అధిక మోతాదులో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడడం, సురక్షిత నీటి కొరత, పారిశుద్ధ్యం సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అవలక్షణాలతో మానవాళే కాకుండా జంతువులు, వ్యవసాయ పంటలు ప్రమాదంలో పడుతున్నాయి. 2000-15 మధ్య కాలంలో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడకం 65 శాతం వరకు పెరుగగా, 2030 నాటికి 200 శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే 2017-30న మధ్య జంతు చికిత్సలకు వాడే ఆంటీబయోటిక్స్ 12 శాతం పెరగవచ్చనే అశుభ వార్తలు వింటున్నాం.

ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం -2026 ఇతివృత్తం :

ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం-2026 ఇతివృత్తంగా "ఒకే ఆరోగ్యం, ఒకే చర్య: ఇప్పుడే ఏఎంఆర్‌ను కట్టడి చేద్దాం (వన్ ఫ్యూచర్, వన్ ఆక్షన్: ప్రివెంట్ ఎఎంఆర్ నౌ)" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఏఎంఆర్ పట్ల అవగాహన కల్పించడానికి పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం, వెటర్నరీ విభాగం, రైతులు, ఫార్మసిస్టులు, విద్యావేత్తలు, యువజన సంఘాలు, సీనియర్ సిటిజెన్స్, వ్యవసాయ శాఖల సమన్వయంతో కృషి చేయాల్సి ఉంది. కరోనా విపత్తు సమయంలో అధిక శాతం రోగులకు ఆంటీబయాట్ ఔషధాలను విచక్షణారహితంగా, అధిక మోతాదులో వాడడంతో నేడు దాని దుష్ప్రభావాలు నేడు తీవ్రరూపం దాల్చడం, తీవ్ర అనారోగ్యాలు కలగడంతో పాటు ప్రాణాలు సహితం పోవడం చూస్తున్నాం. గత ఎనిమిది దశాబ్దాలుగా ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను విరివిగా వాడి రోగాలను నయం చేసే ప్రయత్నాలు చేయడంతో ఆ డ్రగ్స్ పట్ల నిరోధకత పెరిగి వాటి ప్రభావం పూర్తిగా తగ్గడం గమనిస్తున్నాం. ఏఎంఆర్ ఫలితంగా సూక్ష్మజీవుల కారణ సాంక్రమిక వ్యాధులకు చికిత్స కష్టం అవుతున్నది.

ఏఎంఆర్ కట్టడి మార్గాలు:

రానున్న రోజుల్లో ఆంటీ-బాక్టీరియల్, ఆంటీబయాటిక్, ఆంటీవైరల్, ఆంటీఫంగల్, ఆంటీపారాసైటిక్స్ లాంటి ఔషధాలు పని చేయక పోవడంతో, వ్యాధుల కట్టడి వైద్యులకు కష్టం కావడంతో మరో ప్రమాదకర సంక్షోభానికి లేదా విపత్తుకు తలుపులు తెరుచుకుంటున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పని చేయని యెడల రోగులు/జంతువులు/పంటలు కూడా ప్రభావితం కావడం, పలు సంబంధిత సమస్యలకు దారి తీస్తున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోకుండా ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడరాదు. ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అదుపు చేయడానికి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం, సురక్షిత నీరు తాగడం, పరిశుద్ధ ఆహారం తీసుకోవడం, టీకాలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండడం, సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండడం లాంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏఎంఆర్ ప్రతికూల ప్రభావంతో ప్రజలు, పశుసంపద, మత్స్యసంపద, పాడి పరిశ్రమ, ఆక్వాకల్చర్, హార్టీకల్చర్, పండ్ల తోటలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వైద్యులు సూచించినట్లుగా విచక్షణతో వాడడం, మోతాదు మించకపోవడం, ఇతర జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటించడం వల్ల ఏఎంఆర్ అదుపు చేయబడి మానవాళి, జంతువులు, పంటల ఆరోగ్యాలు వర్ధిల్లుతాయి.

డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

పారిశుద్ధ్యంపై అవగాహన అనివార్యం

నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం



ప్రతి సంవత్సరం నవంబర్ 19న జరుపుకునే ప్రపంచ టాయిలెట్ దినోత్సవం, మానవ జీవితంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సురక్షితమైన మరుగుదొడ్ల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో శుభ్రమైన పరిసరాల ప్రాముఖ్యతను జాగృతం చేయడం, ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల వారికి టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రోత్సహించడం.

2001లో, సింగపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త విరాధాన్ బెంకటేశన్ వరల్డ్ టాయిలెట్ ఆర్గనైజేషన్ను స్థాపించారు. టాయిలెట్ సమస్యలు సమాజంలో ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లుగా గుర్తించి, ఈ అంశంపై గ్లోబల్ అవగాహన పెంచే దిశగా కృషి ప్రారంభించారు. 2013లో, ఐక్యరాజ్య సమితి ఈ ప్రయత్నాన్ని గుర్తించి, ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది.

మురికి నీరు, శుభ్రత లేమి కారణంగా డయేరియా, మలేరియా వంటి అనేక అంటువ్యాధులు ప్రబలుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, ప్రతి సంవత్సరం లక్షలాది మంది చిన్న పిల్లలు మరుగుదొడ్ల అసౌకర్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షిత మరుగుదొడ్ల ఏర్పాటు, పరిశుభ్రత అనుసరణతో అనేక వ్యాధుల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు.

ముఖ్యంగా మహిళలు, బాలికలు మరుగుదొడ్ల కొరత కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా పాఠశాలలలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారు చదువు మధ్యలోనే మానేస్తున్నారు. సురక్షిత మరుగుదొడ్లు సమాజంలో మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కాక, సమాన అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

సరైన మురుగు నీటి నిర్వహణ లేకపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. భూమి మరియు నీటి కాలుష్యానికి ఇది ప్రధాన కారణం. సురక్షిత మరుగుదొడ్లతో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా 3.6 బిలియన్ మంది సరైన పారిశుద్ధ్య సదుపాయాలు లేకుండా జీవిస్తున్నారు. గ్రామీణ మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో శుభ్రమైన మరుగుదొడ్ల కొరత అత్యంత తీవ్రమైన స్థాయిలో ఉంది. పిల్లల మానసిక ఆరోగ్యం, మహిళల భద్రత మీద కూడా టాయిలెట్ సౌకర్యాల లేమి ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా టాయిలెట్ అవసరాలపై ప్రజలలో అవగాహన కల్పించడానికి పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.

ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రకారం, 2030 నాటికి ప్రపంచం లోని ప్రతి ఒక్కరికి శుభ్రమైన మరియు సురక్షితమైన మరుగుదొడ్లు అందించాలన్నది లక్ష్యం.

ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరుగుదొడ్ల నిర్మాణంలో ముందుండి భాగస్వాములు కావాలి.

ప్రతి ఒక్కరూ ఈ సమస్యపై చైతన్యవంతులై కృషి చేయవచ్చు. టాయిలెట్ ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులు, స్నేహితులతో చర్చించాలి. పాఠశాలలు, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సహాయ పడాలి. పారిశుద్ధ్యానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

చిమ్మట

చిమ్మట చిమ్మట చిమ్మట
నిశాచర కీటకం చిమ్మట
రాత్రిపూట చిట్ చీట్ పట
వెన్నెల వెలుగంటే ఇష్టమట!

చిమ్మట రాత్రి సీతాకోకచిలుక
ఎగురుతుంటే విమానమే
రెక్కలు విప్పితే గుడారమే
రెక్కలపై రంగు రంగు కన్నులు!

ముట్టుకుంటే బూడిద అలర్జీ
పొలుసులు ఎగురుటకు ఎనర్జీ
ద్రవాలు పదార్థాల తేమను తింటుంది
బట్టల్లో చేరి రంధ్రాలు చేస్తుంది!

నిశి రాత్రికి తోడు చిమ్మట
కిచ్ కిచ్ సంగీతం రాత్రికిగత్తట
దీపం లైటు చుట్టూ తిరుగుతుందట
వెన్నెల్లో ఆడటం ఇష్టమట!

సీతాకోకచిలుకకు సూర్యుడు
ఇంద్రధనుస్సు రంగులద్దుతాడు.
చిమ్మటకు చంద్రుడు
చీకట్లో చూసే చూపునిస్తాడు!

పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250





ఉక్కు మహిళ ఇందిరాగాంధీ.. భారత రాజకీయ చరిత్రలో చెరగని అధ్యాయం!

భారత రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన నాయకురాలు ఇందిరాగాంధీ. ధైర్యం, నిర్ణయాత్మక నాయకత్వం, రాజకీయ వ్యూహాలు, అంతర్జాతీయ వ్యవహారాల్లో చురుకైన పాత్ర.. ఇలా ఎన్నో కోణాల్లో ఆమె ప్రస్థానం ప్రత్యేకమైనది. అదే సమయంలో ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ప్రజాస్వామ్య చరిత్రలో తీవ్ర చర్చకు దారితీశాయి. విజయాలు, వివాదాలు రెండింటితోనూ భారత రాజకీయాల్లో చెరగని అధ్యాయంగా నిలిచిన ఇందిరాగాంధీ జయంతి నవంబర్ 19. 1917 నవంబర్ 19న అలహాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు జన్మించిన ఇందిరా ప్రియదర్శిని చిన్ననాటి నుంచే జాతీయోద్యమ వాతావరణంలో పెరిగారు. స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు పాత్ర పోషించారు. బాల్యంలోనే బాలచర్కా సంఘ్, వానరసేన వంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి సహకరించారు. తండ్రి నెహ్రూ రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా గమనిస్తూ రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు.

1964లో లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, 1966 జనవరి 24న భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. దేశ తొలి మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించారు. 1966 నుంచి 1977 వరకు, తిరిగి 1980 నుంచి 1984 వరకు ప్రధానిగా దేశాన్ని పాలించారు.

దేశ గతిని ప్రభావితం చేసిన నిర్ణయాలు

1969లో 14 ప్రధాన వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ ఇందిరాగాంధీ పాలనలో కీలక ఘట్టం. బ్యాంకింగ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం, వ్యవసాయం, చిన్న పరిశ్రమలకు రుణ సదుపాయాలు పెంచడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలు. దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల పాత్రను మార్చిన నిర్ణయంగా ఇది చరిత్రలో నిలిచింది.

వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి ఆమె ప్రభుత్వ హయాంలో ప్రాధాన్యం పెరిగింది. అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, సాగునీటి సదుపాయాలు, ఎరువుల వినియోగం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంపునకు చర్యలు చేపట్టారు. ఒకప్పుడు ఆహార ధాన్యాల కోసం విదేశాలపై ఆధారపడిన భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడానికి ఈ పరిణామాలు తోడ్పడ్డాయి.

1971లో భారత్-పాకిస్థాన్ యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావం ఆమె రాజకీయ జీవితంలో మరో కీలక ఘట్టం. అంతర్జాతీయంగా భారత్ పాత్ర, దౌత్యపరమైన నిర్ణయాలు ఆ సమయంలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఈ పరిణామాల నేపథ్యంలో 1972లో ఆమెకు భారతరత్న పురస్కారం లభించింది.

ప్రజాస్వామ్య చరిత్రలో వివాదాస్పద అధ్యాయం

ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని కేవలం విజయాల కోణంలోనే చూడలేం. 1975 జూన్‌లో దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించడం ఆమె పాలనలో అత్యంత వివాదాస్పద నిర్ణయంగా నిలిచింది. పౌర హక్కులపై ఆంక్షలు, పత్రికలపై సెన్సార్‌షిప్, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైంది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందగా, ఇందిరాగాంధీ అధికారాన్ని కోల్పోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు ఎంత శక్తిమంతమైనదో ఈ పరిణామం మరోసారి నిరూపించింది. అయితే 1980 ఎన్నికల్లో తిరిగి విజయం సాధించి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

1984 జూన్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో జరిగిన ఆపరేషన్ బ్లూస్టార్ అనంతరం దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే ఏడాది అక్టోబర్ 31న తన భద్రతా సిబ్బంది కాల్పుల్లో ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆమె మరణం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అనంతరం దేశవ్యాప్తంగా జరిగిన సిక్కు వ్యతిరేక హింస కూడా భారత చరిత్రలో విషాదకర అధ్యాయంగా మిగిలిపోయింది.

చరిత్ర ఇచ్చే పాఠం ఏమిటి?

ఇందిరాగాంధీ జీవితం ఒక వ్యక్తి రాజకీయ ప్రస్థానం మాత్రమే కాదు.. భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న విజయాలు, సవాళ్లు, సంక్షోభాలకు అద్దం పట్టే చరిత్ర. ఒకవైపు బ్యాంకుల జాతీయీకరణ, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం, బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో నాయకత్వం వంటి నిర్ణయాలు ఆమె పాలనలో గుర్తుండిపోయాయి. మరోవైపు ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య విలువల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూనే ఉంటుంది.నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండటం కాదు. ప్రజల హక్కులను గౌరవించడం, ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం, విమర్శలను స్వీకరించడం కూడా అంతే ముఖ్యం. ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఈ విషయాలను అధ్యయనం చేయడానికి ఒక ముఖ్యమైన చారిత్రక సందర్భం.109వ జయంతి సందర్భంగా ఆమె జీవితాన్ని, విజయాలను, వివాదాలను సమగ్రంగా పరిశీలించడం అంటే ఒక నాయకురాలిని స్మరించుకోవడమే కాదు.. భారత ప్రజాస్వామ్య ప్రయాణాన్ని మరోసారి గుర్తుచేసుకోవడం కూడా.

-ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
సీనియర్ జర్నలిస్ట్, DAE
(భారత అనుపరిశోధన విభాగం)ట్రైనీ
ట్రేడ్ జర్నలిస్ట్
9440287170.



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు

- ఈ నెల 19వ తేదీ నుంచి చేయూత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా డబ్బులు జమ
- బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)

జిల్లాలో బోయినపల్లి మండలంప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలు, చేయూత పెన్షన్ మంజూరుపై పాటల ద్వారా వివరించారు.బోయినపల్లి మండలంలోని 567మంది లబ్ధిదారులకు బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.చేయూతపెన్షన్ కోసం ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. జిల్లా మొత్తం 8,209, బోయినపల్లి మండలంలో 567 నూతన పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో బోయినపల్లి మండలంలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షల విలువైన బీమా వర్తిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజుల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారు లేనివారు సైతం అర్హులని స్పష్టం చేశారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక పథకాలు అభివృద్ధి అమలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు ఐదు లక్షల చేయూత పెన్షన్లు సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే నూతన రేషన్ కార్డులు అందిస్తున్నామని, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయిస్తున్నామని వివరించారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని వెల్లడించారు. మండలంలో ఇందిరమ్మ ఇల్లు శరవేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. మండలంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.12 కోట్లతో స్టేడియం నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫోద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లలో అనర్హుల వివరాలు వెల్లడించాలి



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)

సిరిసిల్లలోని సినారె కళామందిరంలో బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి పాల్గొన్నారు. సిరిసిల్లలో 2,276 మంది దరఖాస్తు చేసుకోగా, 1,668 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారని, మిగిలిన 608 మందిని అనర్హులుగా ప్రకటించడానికి గల కారణాలను అధికారులు వెల్లడించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని, అనర్హుల జాబితాపై పూర్తిస్థాయి వివరాలు పాలకవర్గ సభ్యులకు అందించాలని సూచించారు. వృద్ధాప్య పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వృద్ధులకు కూడా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.2,016, దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి ఎన్నికల హామీ మేరకు రూ.4,000, రూ.6,000కు పెంచాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, డీఆర్డీఏ జిల్లా అధికారి, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జన సురక్ష బీమా పథకాలపై అవగాహన



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)

సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డులో బుధవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాల ద్వారా తక్కువ ప్రీమియంతో ప్రమాద, జీవిత బీమా సౌకర్యాలు పొందవచ్చని వివరించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్బి వై) ద్వారా 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వారికి ఏడాదికి కేవలం రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం జె జె బి వై) ద్వారా 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల వారికి ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా అందిస్తున్నట్లు వివరించారు. నిబంధనల ప్రకారం 50 ఏళ్ల వరకు బీమా కొనసాగించుకునే అవకాశం ఉందన్నారు.ప్రజలు ఈ పథకాలపై అవగాహన పెంచుకొని, అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా పథకాల్లో చేరి తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బంది, వైస్ చైర్మన్ దార్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

20న పెద్దపల్లిలో విదేశీ ఉద్యోగాల రిజిస్ట్రేషన్ మేళా

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి):

జిల్లాలోని నిరుద్యోగ యువత విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. TOMCOM మరియు జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 20న పెద్దపల్లి IDOC భవనంలోని గది నంబర్ 233లో విదేశీ ఉద్యోగాల రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నారు. జర్మనీ, అమెరికా, ఆస్ట్రియా, ఐర్లాండ్, జపాన్, దుబాయ్, ఇజ్రాయెల్ సహా 12 దేశాల్లో నర్సింగ్, వైద్య సేవలు, నిర్మాణ రంగం, డ్రైవింగ్, వెల్డింగ్, కేర్ వర్కర్స్ విభాగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలి. వివరాలకు 080 3552 4946, 8985336947, 8121262441 నంబర్లను సంప్రదించవచ్చు.

21న సింగరేణి మెడికల్ కళాశాలలో మెగా సీపీఆర్ అవగాహన

గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ (CPR) పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. నవంబర్ 21న ఉదయం 10 గంటలకు సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (SIMS) మైదానంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులతో మెగా సీపీఆర్ అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి SIMS విద్యార్థులు, అధ్యాపకులు కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సమాజంలో ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.

కేశవపట్నం నూతన ఎస్ఐకి ఘన సన్మానం

కరీంనగర్ టౌన్, నవంబర్18(బి క్రైమ్ న్యూస్)



మండలంలోని కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నందిరెడ్డి నరేష్ రెడ్డి ని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ,కొలిపాక గౌతమీ మానకొండూర్ మహిళ ఆర్గనైజేర్ సెక్రటరీ,సల్మా మానకొండూర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శంకరపట్నం మండల ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు జైపాల్ రెడ్డి కలిసి ఎస్ఐ నందిరెడ్డి నరేష్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి):



తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా నవంబర్ 29న కరీంనగర్ సమీపంలోని అలుగునూరులో నిర్వహించనున్న 'దీక్షా దివస్' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. సభ సన్నాహాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమై, రైతులకు సాగునీరు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్లను తక్షణమే ప్రారంభించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ, కాళేశ్వరం, రైతుబంధు, గురుకుల విద్యాలయాల ద్వారా తెలంగాణ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని పేర్కొన్నారు. గత అభివృద్ధిని, ప్రస్తుత సమస్యలను గ్రామ గ్రామాన వివరించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. అలుగునూరు సభ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటిచెప్పేలా ఉండాలన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ "కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో" అనే నినాదంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. అరెస్టులు నిర్బంధాలు ఎదురైనా వెనక్కి తగ్గని ఆయన త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుబంధు, రైతు బీమా, విద్యుత్ సరఫరా, యూరియా పంపిణీతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.పెన్షన్ల పెంపుతో పాటు ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, నవంబర్ 29న జరిగే అలుగునూరు సభకు వేలాదిగా తరలిరావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తానిపర్తి మోహన్ రావు, వంగల తిరుపతిరెడ్డి, నునేటి సంపత్, ఉప్పు రాజకుమార్, సందీప్ రావు, రవీందర్, పెంచాల శ్రీధర్, వివిధ మండలాల అధ్యక్షులు బైరెడ్డి రాంరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రంలో పెద్దపల్లికి రెండవ స్థానం



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి):

హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో అద్భుత పురోగతి సాధించి, దేశంలోనే రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో – NACO) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో భాగంగా విడుదల చేసిన తాజా జాతీయ స్కోర్‌కార్డులో తెలంగాణ ఈ ఘనత సాధించిందని ఆయన వెల్లడించారు.

డిసెంబర్ 2023 నాటికి జాతీయ స్థాయిలో 32వ స్థానంలో ఉన్న తెలంగాణ, గత ఆర్థిక సంవత్సరంలో 13వ స్థానానికి ఎగబాకి, ప్రస్తుతం ఏకంగా రెండో స్థానానికి చేరుకుందని కలెక్టర్ వివరించారు. రాష్ట్రంలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల పటిష్ట అమలుకు ఈ ర్యాంకు నిదర్శనమని తెలిపారు.

'సురక్షిత్' జాబితాలో పెద్దపల్లి

రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 20 జిల్లాలు హెచ్ఐవీ నియంత్రణకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించి 'సురక్షిత్' (Surakshit) హోదాను పొందాయని, ఈ ప్రతిష్టాత్మక జాబితాలో పెద్దపల్లి జిల్లా కూడా చోటు దక్కించుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. హెచ్ఐవీ బాధితులను సకాలంలో గుర్తించడం, వారికి మెరుగైన వైద్య సేవలు, నిరంతర చికిత్స అందించడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం వల్లే ఈ లక్ష్యాన్ని చేరుకోగలిగామని చెప్పారు.సురక్షిత్ హోదా సాధించిన 20 జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సన్మానించనుందని తెలిపారు. ఈ జాబితాలో పెద్దపల్లి ఉండటం జిల్లా ప్రజలకు, యంత్రాంగానికి దక్కిన గౌరవమని అన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ సేవలు కొనసాగించాలని సూచించారు. సకాలంలో పరీక్షలు, నిరంతర చికిత్స, అవగాహనతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శిశు మందిర్ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విద్యా, సాంస్కృతిక విలువలను పెంపొందించడంలో శిశు మందిరాల పాత్ర కీలకం : డాక్టర్ మర్రి రామ్ రెడ్డి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)



లింగంపేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల భవన నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్ రెడ్డి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి విద్యాపీఠ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు మందిరాలు విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను బోధించడంలో విశేష కృషి చేస్తున్నాయని అన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత, క్రమశిక్షణ, మంచి నడవడిక వంటి విలువలను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు.భావి భారత పౌరులను ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో శిశు మందిరాలు పునాదులుగా నిలుస్తున్నాయని, ఇలాంటి విద్యాసంస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా ఇన్‌చార్జి మర్రి బాపురెడ్డి, లింగంపేట మండల బీజేపీ అధ్యక్షులు బొల్లారం క్రాంతికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కాని దత్తు రాములు, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచందర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అండ్యాల ఉదయ్, పట్టణ అధ్యక్షులు నరేష్ భగవాన్, బూత్ అధ్యక్షులు బొల్లు గణేష్, రామకృష్ణ, శిశు మందిర్ అధ్యాపక బృందం, పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా' పథకం ప్రారంభం!

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 18, (సింగిడి):



తెలంగాణలోని పేద మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నేడు నవంబర్ 19న సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అలాగే మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. పథకం ముఖ్య ఉద్దేశం మరియు ప్రయోజనాలు..రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన పేద మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుంది. అనుకోని పరిస్థితుల్లో కుటుంబ పెద్ద కోల్పోతే ఆ కుటుంబం వీధిన పడకుండా తక్షణ ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ప్రధాన లక్ష్యం...దరఖాస్తు మరియు నమోదు ప్రక్రియ..నేటి (నవంబర్ 19) నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలలో అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరణ మరియు ఆన్లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న అర్హులందరూ తమ సమీపంలోని పంచాయతీ లేదా మున్సిపల్ కార్యాలయాలను సంప్రదించి పథకంలో పేర్లు నమోదు చేసుకోవచ్చు

సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 18(సింగిడి)



పొన్నం ప్రభాకర్రేపు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో సిద్దిపేట బైపాస్ రోడ్డులోని నాగదేవత ఆలయం వద్ద జరుగుతున్న సభ ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.సభ ఏర్పాట్లు దాదాపు పూర్తయిన నేపథ్యంలో సభా వేదికను, ఇతర మౌలిక సదుపాయాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు.మట్టి రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన స్థలాలను కేటాయించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.సభా ప్రాంగణంలో భారీ కేడింగ్, భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్‌కు పలు సూచనలు చేశారు. పోలీస్, ట్రాఫిక్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సభను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

ఉదయంలోగా హెలిప్యాడ్ సిద్ధం కావాలి



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 18(సింగిడి)

ముఖ్యమంత్రి సిద్దిపేట జిల్లాలో పర్యటన సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ కె. హేమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో హెలిపాడ్ పనులు యుద్ధ ప్రతిపాదకన అర్ధరాత్రిలో పూర్తి చేసి రేపు ఉదయం లోగా తయారు చేయాలని అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. నాగదేవత గుడి ముందు భాగంలో నిర్వహించే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పలుమార్లు సందర్శించారు. ముస్తాబాద్ రోడ్డు నుండి భారీ బహిరంగ సభ ప్రాంగణానికి పద్దకు ర్యాలీ మార్గాన్ని పరిశీలిస్తూ చుట్టూ పక్కన చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. భారీ బహిరంగ సభ ప్రాంగణంలో స్టేజి వివిధ పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు శిలాఫలకాల ఆవిష్కరణ, వి వి ఐ పి వీఐపీ మీడియా ప్రజాప్రతినిధులు ప్రజలు ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్లు ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయించాలని విద్యుత్ శాఖ అధికారులను, ఉదయంలోగా స్టేజి భారీ బహిరంగ సభ ప్రాంగణం మొత్తం పనులు పూర్తి చేయించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

అర్హులైన ప్రతీ కుటుంబానికి అండగా ప్రజా ప్రభుత్వం

కామారెడ్డి నవంబర్ 18 (సింగిడి)

నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంక్షేమ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సామాజిక భద్రతతో పాటు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట్ PACS చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి★, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.సామాజిక భద్రతకు పెద్దపీట... పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా... అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పం!



ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కోరకు స్థల పరిశీలన

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి)

ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోరకు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ, డివిజన్ మండల నాయకుల ఆధ్వర్యంలో పరిశీలన చేశారు ఈ సందర్భంగా చౌరస్తాలో విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు, ఇతర అంశాలపై చర్చించారు.అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ఎల్లారెడ్డిలో ప్రతిష్టాత్మకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యువజన సంఘం నాయకులు పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధిత అధికారుల సహకారం తీసుకుని త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గంగారం, ప్రధాన కార్యదర్శి రాజు, ముదాం సాయిలు, యాదయ్య, లీడర్ రవీందర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి బిట్ల సురేందర్, డివిజన్ అధ్యక్షులు మర్రు సాయిబాబా, ఉపాధ్యక్షుడు సాయిలు, లెగ్గల రాజు, ప్రధాన కార్యదర్శి రొడ్డ సాయిబాబా, డివిజన్ కోశాధికారి భూపతి, ఎల్లారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కుసుల కంటి సాయిలు, అడవి లింగాల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోరన్ పల్లి శ్రీనివాస్, నాయకులు, పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో జ్ఞానికా రెడ్డి ప్రతిభ

తల్లాడ, నవంబర్ 18(సింగిడి)

జాతీయస్థాయి నృత్య పోటీల్లో తల్లాడకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి దగ్గుల జ్ఞానికా రెడ్డి తన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి నృత్య పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. ఇందులో భాగంగా బుధవారం కూచిపూడి నృత్య ప్రదర్శనతో తనదైన శైలిలో ఆకట్టుకుంది.చిన్న వయసులోనే జాతీయ స్థాయి వేదికపై తన నృత్య ప్రతిభను ప్రదర్శించడంతో పలువురు అభినందిస్తున్నారు. తల్లాడకు చెందిన దగ్గుల సుధాకర్ రెడ్డి, లక్ష్మీ దంపతుల కుమార్తె అయిన జ్ఞానికా రెడ్డి భవిష్యత్తులో నృత్యరంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డం వీరమోహన్ రెడ్డి, తల్లాడ గ్రామ పంచాయతీ మాజీ వీడీసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ధూపాటి భద్రరాజు, దగ్గుల నర్సిరెడ్డి, అప్పిరెడ్డి, షేక్ ఈసూబ్, రామకృష్ణ రెడ్డి తదితరులు జ్ఞానికా రెడ్డిని అభినందించారు.

12వ వార్డులో చేయూత కొత్త పింఛన్ పత్రాల పంపిణీ

చేవెళ్ల, నవంబర్ 18(సింగిడి)

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మంగళవారం చేయూత సందడి నెలకొంది. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ పత్రాలను లబ్ధిదారులకు చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ అత్తిలి మనీషా అనంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడడమే తమ లక్ష్యమని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పింఛన్ నెలనెలా భరోసానిస్తుందన్నారు. కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి మాట్లాడుతూ తమ వార్డులో అర్హులైన ఒక్కరు కూడా మిగిలిపోకుండా చూసుకుంటామని, ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు.పింఛన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నెలనెలా వచ్చే పింఛన్ తమ కుటుంబ పోషణకు ఎంతో ఆసరాగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కొత్త డాక్యుమెంటేషన్ కార్యాలయం ప్రారంభం



చేవెళ్ల, నవంబర్ 18(సింగిడి)

చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన జీఎస్టీ ఏ వన్ డాక్యుమెంటేషన్ కార్యాలయాన్ని బుధవారం శాసనసభ్యులు కాలే యాదయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా దేవర వెంకటరెడ్డి ప్రారంభించారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఉరెళ్ళ వార్డుకు చెందిన గడ్డమీది కుమార్, కృష్ణ, శేఖర్, రాజు ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, చేవెళ్ల ప్రజలకు డాక్యుమెంటేషన్, జీఎస్టీ సంబంధిత సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. కొత్తగా ఏర్పాటైన ఈ కార్యాలయం ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.నిర్వాహకులకు అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్, డాక్యుమెంటేషన్, జీఎస్టీ సంబంధిత పనులు సులభతరం కానున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శైలజ ఆగి రెడ్డి, మనీషా అనంత్ రెడ్డి, ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, పెద్దోళ్ల దయాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తారా..?
- పెండింగ్ పనులకు మోక్షం కల్పిస్తారా..?
- సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగంపై ప్రజల్లో భారీ అంచనాలు
- ఎన్నికల హామీల అమలుపై స్పష్టత కోరుతున్న సిద్దిపేట

సిద్దిపేట సభపై సర్వత్రా ఆసక్తి!



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 18(సింగిడి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి హోదాలో సిద్దిపేట గడ్డపై నిర్వహించనున్న భారీ బహిరంగ సభపై జిల్లా ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ఈ సభ ద్వారా ముఖ్యమంత్రి ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.అయితే సిద్దిపేట ప్రజలు ఈ సభను కేవలం రాజకీయ ప్రసంగాలకో, జనసమీకరణకో పరిమితం చేయాలని కోరుకోవడం లేదు. తమ ప్రాంత అభివృద్ధికి స్పష్టమైన భరోసా లభించాలని, ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఆకాంక్షిస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

గత పనులకు బాధ్యత ఎవరిది?

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో ప్రారంభమైన పలు అభివృద్ధి పనులు, ప్రతిపాదనలు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తరచూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గతంలో మంజూరైన నిధులు, ప్రారంభించిన పనులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఈ విమర్శలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన రాజకీయ, పరిపాలనా బాధ్యత ఉంది. విమర్శలు, ప్రతి విమర్శల మధ్య అసలు అభివృద్ధి అంశాలు మరుగున పడకూడదన్నది ప్రజల అభిప్రాయం. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు ఏ స్థాయిలో ఉన్నాయి? ఎన్ని పూర్తయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? నిధుల కేటాయింపు ఎంత? పూర్తయ్యే గడువు ఎప్పుడు? అనే అంశాలపై ప్రభుత్వం వాస్తవాలతో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.గత ప్రభుత్వాన్ని విమర్శించడం మాత్రమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం కాకూడదు. గతంలో చేపట్టిన మంచి పనులను కొనసాగిస్తూ, నిలిచిపోయిన పనులను పూర్తి చేసి, కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది.

హామీల అమలుపై స్పష్టత కావాలి!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఇతర హామీల అమలుపై కూడా సిద్దిపేట ప్రజలు స్పష్టత కోరుతున్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సంక్షేమ పథకాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పేదలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని ఆశిస్తున్నారు. సిద్దిపేట పట్టణంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ ఆసుపత్రి, వెయ్యి పడకల ఆసుపత్రి వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, జిల్లా కేంద్రంగా మరిన్ని విద్యా, వైద్య సంస్థలను తీసుకురావడం వంటి అంశాలపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభవృద్ధి అజెండా కావాలి!

సిద్దిపేట రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రాంతం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బలమైన రాజకీయ కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తన అభివృద్ధి కార్యాచరణను ప్రజల ముందు నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది. ఒకవైపు హరీశ్ రావు గత అభివృద్ధి పనులపై ప్రశ్నలు సంధిస్తుండగా, మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం తన పాలనలో సిద్దిపేటకు అందించబోయే అభివృద్ధి ఫలాలను వివరించాల్సిన అవసరం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, సిద్దిపేట అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించేలా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో జరిగిన అభివృద్ధిని తక్కువ చేయకుండా, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలి. అభివృద్ధి పనులకు నిధులు, అమలు బాధ్యతలు, పూర్తిచేసే గడువులను స్పష్టంగా వెల్లడించాలి.

సీఎం ప్రసంగంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి!

సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం మాట్లాడబోతున్నారు? హరీశ్ రావు విమర్శలకు ఎలాంటి సమాధానం ఇవ్వనున్నారు? సిద్దిపేట అభివృద్ధికి ప్రత్యేక హామీలు ప్రకటిస్తారా? గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ వెల్లడిస్తారా? కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీల అమలుపై ప్రజలకు ఎలాంటి భరోసా కల్పిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారాయి.ముఖ్యంగా సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి చేసే ప్రకటనలు కేవలం జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే రాష్ట్ర ప్రజలు సైతం ఈ సభను ఆసక్తిగా గమనిస్తున్నారు.

సభ ముగిసిన తర్వాతే అసలైన పరీక్ష!

భారీ బహిరంగ సభలు, ప్రజా సమీకరణలు, ప్రసంగాలు తాత్కాలిక రాజకీయ సందడిని తీసుకురావచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేది అమలయ్యే అభివృద్ధి పనులే. ఇచ్చిన హామీలను నెరవేర్చడం, పెండింగ్ పనులను పూర్తి చేయడం, కొత్త ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం, ప్రకటించిన కార్యక్రమాలను నిర్దేశిత సమయంలో అమలు చేయడమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానం.సిద్దిపేట ప్రజలు కోరుకుంటున్నది రాజకీయ ఆధిపత్యం కాదు.. అభివృద్ధిలో ముందడుగు. విమర్శలు, ప్రతి విమర్శలు కాదు.. సమస్యలకు పరిష్కారం. హామీల ప్రకటనలు కాదు.. వాటి అమలు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట సభ ఈ ప్రజాకాంక్షలకు వేదిక కావాలి. సిద్దిపేట అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తూ, గతంలో పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కల్పించి, భవిష్యత్ అభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తేనే ఈ సభకు నిజమైన సార్థకత చేకూరుతుంది.ప్రజల ఆశలు నెరవేరుస్తారా? హామీలను ఆచరణలో చూపిస్తారా? సిద్దిపేట అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభిస్తారా? అన్నది ముఖ్యమంత్రి ప్రసంగం, ఆ తర్వాత ప్రభుత్వ కార్యాచరణ తేల్చనున్నాయి.







కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సంకల్పం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్న సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గేది లేదు
ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక భట్టి విక్రమార్కుల పని చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి
రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మధిర, నవంబర్ 18(సింగిడి)



తెలంగాణాలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో మధిర నియోజకవర్గంలో 33,477 పింఛన్లు ఉండగా, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొత్తగా 5,317 పింఛన్లు మంజూరు చేయడంతో మొత్తం పింఛన్ల సంఖ్య 42,794 కు చేరిందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ పేదలకు అందించే సంక్షేమ పథకాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాజీ పడటం లేదన్నారు. మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి శ్రీహరి తెలిపారు. మహిళల చేతుల్లో ఆర్థిక వనరులు ఉంటే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, పిల్లల చదువులు, ఆరోగ్యం కుటుంబ అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు. అందుకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్ళను మహిళల పేరుతో మంజూరు చేయటం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. గత ప్రభుత్వాల హయాంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి అర్హుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నీ నో ప్రభావంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదన్నారు. వచ్చే వర్షాకాలం వరకు ప్రజలకు అవసరమైన సన్నబియ్యం నిలవలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, పంపిణీ నిరంతరాయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రూ 20 లక్షల వరకు రుణాలు అందించే అవకాశం కల్పిస్తున్నామని, సంఘ సభ్యురాలు మరణిస్తే రూ 2 లక్షల బీమా సౌకర్యం కూడా అందిస్తున్నామని వివరించారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా మహిళలకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ విధానమని మంత్రి స్పష్టం చేశారు మహిళల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.



అల్లాడి శ్రీనివాస్‌కు సేవారత్న జాతీయ అవార్డు

సిద్దిపేట, నవంబర్ 18(సింగిడి)

సమాజ సేవే లక్ష్యంగా, పేదలు, నిరుపేదలు, అనాథలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవతా విలువలను చాటుతున్న అల్లాడి శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక మైన సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన ఎన్నో సంవత్సరాలుగా సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. అల్లాడి శ్రీనివాస్ కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం కాకుండా సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమాన్ని తన బాధ్యతగా భావిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, అనాథలకు అండగా నిలవడం, నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయడం ద్వారా ఎన్నో కుటుంబాలకు చేయూతనందిస్తున్నారు. ఆపద సమయంలో ఆదుకునే వ్యక్తిగా పేద ప్రజల మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు పుస్తె మట్టెలు అందిస్తూ ఆ కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తనవంతు సహకారం అందిస్తున్నారు. విద్యే సమాజ అభివృద్ధికి పునాది అనే భావనతో పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. విద్యార్థులకు బస్సు పాసులు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తూ వారి విద్యాభ్యాసం సజావుగా సాగేందుకు తోడ్పడుతున్నారు. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం, అవసరమైన వారికి ఆపన్న హస్తం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా సేవాభావాన్ని చాటుకుంటున్నారు. అంతేకాకుండా సమాజంలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని దానం చేసి తన గొప్ప దాతృత్వాన్ని చాటుకున్నారు. పేదల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, కులమతాలకు అతీతంగా అవసరమైన వారికి సహాయం చేయాలనే సదుద్దేశంతో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రచారం కోసం కాకుండా మానవతా దృక్పథంతో సేవ చేయాలనే ఆయన ఆలోచన పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. సమాజంలోని నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషి, అనాథలకు అందిస్తున్న అండదండలు, ఆధ్యాత్మిక రంగంలో చూపుతున్న దాతృత్వం తదితర సేవలను పరిగణనలోకి తీసుకున్న బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సెలక్షన్ కమిటీ అల్లాడి శ్రీనివాస్‌ను సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ పురస్కారం ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా సమాజ సేవకు లభించిన గౌరవంగా పలువురు అభివర్ణిస్తున్నారు.

"నువ్వు కూడా పరాయి జీవివే.. జాక్‌పాట్ ఎమ్మెల్యే అయ్యావు?"

ఎమ్మెల్యే సంజయ్‌పై జువ్వాడి నర్సింగరావు నిప్పులు
తనపై దాడిని ఖండించిన కాంగ్రెస్ నేత
ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్

మెట్‌పల్లి, నవంబర్ 18(సింగిడి)



కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయ ప్రత్యర్థులను విమర్శించే ముందు తమ రాజకీయ నేపథ్యాన్ని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉద్దేశించి 'నువ్వు కూడా పరాయి జీవివే.. జాక్‌పాట్ ఎమ్మెల్యే ఎలా అయ్యావు? ఎక్కడి నుంచి వచ్చావు?' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు.బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జువ్వాడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. తనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమని, వాటిని రాజకీయంగానే ఎదుర్కోవాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరంగానే పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

రాజకీయ విమర్శలకు హద్దులుండాలి

రాజకీయాల్లో విమర్శలు చేసుకోవచ్చని, అయితే వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు, దాడులకు దిగడం సరైన పద్ధతి కాదని నర్సింగరావు అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధులపై విమర్శలు చేసే సమయంలో రాజకీయ హుందాతనం పాటించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

అభవృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి

నియోజకవర్గంలో విద్యాసంస్థల ఏర్పాటు, యువతకు మెరుగైన విద్యావకాశాలు, రహదారులు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని అన్నారు. కాడి భూములు, పూడూరు, కిష్టినగర్ ప్రాంతాల్లో భూముల విక్రయాలకు సంబంధించిన అంశాలు ప్రజల్లో చర్చకు వస్తున్నాయని ప్రస్తావించారు. ఈ వ్యవహారాలపై సంబంధిత వర్గాలు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు ఎంత కృషి చేశారు? ఎవరి హయాంలో ఎన్ని పనులు జరిగాయి? అనే అంశాలపై ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.

జాబ్ డ్రైవ్‌కు స్పందన

ఆమనగల్లు, నవంబర్ 18(సింగిడి):

గ్రామీణ నిరుద్యోగ యువత జీవితాల్లో ఉద్యోగ వెలుగులు నింపడమే లక్ష్యంగా ఐకృత ఫౌండేషన్ పనిచేస్తోందని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గత నెల 28న మాడ్గులలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ జాబ్ డ్రైవ్‌లో మొత్తం 220 మంది అభ్యర్థులు షార్ట్ లిస్ట్ అయ్యారు. వీరికి తుక్కుగూడలోని ఒక ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం మొదటి విడత ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నియామక ప్రక్రియను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కంపెనీ వద్దకు వెళ్లి స్వయంగా పర్యవేక్షించారు.మొదటి విడత ఇంటర్వ్యూలలో మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 52 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో నల్లచెరువు గ్రామానికి చెందిన 14 మంది, మాడ్గుల 13, నర్సాయిపల్లి 12, ఇర్విన్ 9, కొలుకులపల్లి గ్రామానికి చెందిన నలుగురు అభ్యర్థులు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పసిప్రాయంలోనే టైప్-1డయాబెటిస్



దేశంలో అధిక సంఖ్యలో పిల్లలు మధుమేహం బారిన పడుతున్నారు. భారత్‌లో మూడు లక్షల మందికి పైగా చిన్నారులు 'టైప్-1' డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నారని తాజాగా ఓ సర్వే వెల్లడించింది.

దేశంలో అధిక సంఖ్యలో పిల్లలు మధుమేహం బారిన పడుతున్నారు. భారత్‌లో మూడు లక్షల మందికి పైగా చిన్నారులు 'టైప్-1' డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నారని తాజాగా ఓ సర్వే వెల్లడించింది. ఈ సంఖ్య ప్రపంచంలోనే అత్యధికం. ఈ నేపథ్యంలో మధుమేహ నిర్ధారణ, చికిత్స లాంటి అంశాలపై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల్లో ఈ రకం మధుమేహాన్ని ఎలా గుర్తించాలో వివరిస్తున్నారు. 'టైప్-1' డయాబెటిస్ కారణంగా బీపీ లాంటి ఇతర సమస్యలు వచ్చే అవకాశాలూ ఉన్నాయని అంటున్నారు. సరైన ఆహారపు అలవాట్లు పాటిస్తూ.. వ్యాయామం చేస్తే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచగలమని చెబుతున్నారు. చిన్నపిల్లల్లో డయాబెటిస్ లక్షణాలు కనిపిస్తే అసలు నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరిస్తున్నారు.

పిల్లల్లో ఈ కింది లక్షణాలు కనిపిస్తే అసలు నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే మధుమేహ పరీక్షలు చేయించాలి. లేకుంటే పిల్లలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు.

- అధిక దాహం (పాలిడిప్సియా)
- తరచుగా మూత్ర విసర్జన (పాలియూరియా)
- ఆకలి పెరగడం (పాలీఫేజియా)
- అకస్మాత్తుగా బరువు తగ్గడం
- అలసట, తక్కువ శక్తి
- చిరాకు, మానసిక స్థితిలో మార్పులు
- వికారం, వాంతులు

'టైప్-1' డయాబెటిస్ నయం చేసే మందులు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ మాత్రమే దారి.

'టైప్-1' డయాబెటిస్ అంటే..

రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించే ప్యాంక్రియాస్ కణాలపై రోగనిరోధక శక్తి దాడి చేయడంతో 'టైప్-1' డయాబెటిస్ ఏర్పడుతుంది. చిన్నారుల్లో, మరీ ముఖ్యంగా ఏడేళ్ల వయసు లోపు వారిలో ఈ ప్యాంక్రియాస్ అభివృద్ధి దశలోనే ఉంటుంది. అందుకే వీరు ఎక్కువగా ఈ రకం మధుమేహానికి గురవుతున్నారని పరిశోధనలు పేర్కొంటున్నాయి. దీని బారిన పడిన వారు జీవితాంతం ఇన్సులిన్ తీసుకోవాల్సిందే.

క్యాప్సికమ్‌లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

క్యాప్సికమ్ తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయండోయ్. అందులోని పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

కొందరు క్యాప్సికమ్ తినడానికి ఇష్టపడరు. అయితే దీన్ని తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చలికాలంలో ఈ కూరగాయను తీసుకోవడం మంచిదని వివరిస్తున్నారు. క్యాప్సికమ్‌లో విటమిన్ సీ, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే ఈ కూరగాయను తప్పనిసరిగా ఆహారంలో భాగంగా చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బరువు నియంత్రణ

బరువు తగ్గాలనుకునే వారికి క్యాప్సికమ్ సహాయపడుతుంది. ఇందులో తక్కువ కేలరీలు, ఎక్కువ పీచుపదార్థం ఉంటాయి. ఈ కూరగాయలో నీటి శాతం కూడా ఎక్కువే. దీన్ని సలాడ్, ఆకుకూరలు లేదా సూప్ రూపంలో తీసుకోవచ్చు. అధిక నీటి శాతం కారణంగా క్యాప్సికమ్ తక్కువగా తిన్నా కడుపు నిండిన భావన ఏర్పడుతుంది. దీంతో బరువు నియంత్రణ సాధ్యమవుతుంది.



రోగనిరోధక శక్తి

క్యాప్సికమ్‌లో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచీ కాపాడతాయి. రోగనిరోధక వ్యవస్థకు విటమిన్ సీ చాలా అవసరం.

గుండె ఆరోగ్యం

క్యాప్సికమ్‌లో పొటాషియంతో సహా కొన్ని ఖనిజాలు ఉన్నాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కేవలం క్యాప్సికమ్ తినడం ద్వారా అన్ని గుండె జబ్బులూ తగ్గిపోతాయని భావించకూడదు.

ఐరన్ అందిస్తుంది..

శరీరానికి ఐరన్ అవసరం. క్యాప్సికమ్‌లో ఈ ఐరన్ కొద్ది మొత్తంలో ఉంటుంది. అందుకే ఈ కూరగాయను పప్పులు, ఆకుకూరలతో కలిపి తీసుకోవడం మంచిది.

క్యాప్సికమ్‌ను పప్పులు, సూప్‌లు, సాంబార్లు లాంటి వంటకాలలో చేర్చుకోవచ్చు. దీనిని ఎక్కువగా ఉడికించకుండా తినాలి. అప్పుడే విటమిన్ సీ శరీరానికి అందుతుంది. సమతుల్య ఆహారంలో భాగంగా క్యాప్సికమ్‌ను తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

అతివ Athiva Singidi

రోజూ రాత్రి 2 ఖర్జూరాలు తింటే హార్మోన్ల సమతూల్యత!

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన మానసిక ఒత్తిడి నేడు అనేక మంది మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యత, సంతానోత్పత్తికి సంబంధించిన సమస్యలు సర్వసాధారణమైపోయాయి.

గర్భధారణకు ప్రయత్నించే సమయంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మహిళలు ఖచ్చితంగా తమ రోజువారీ ఆహారంలో కొన్ని ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలి. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం, మహిళల సంతానోత్పత్తి శక్తిని సహజంగా పెంచడంలో ఖర్జూరం ఒక దివ్యౌషధంగా పనిచేస్తుంది. అందులోనూ ఖర్జూరాన్ని వేయించి తినడం ద్వారా మరింత ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయి.

ఆయుర్వేదంలో వేయించిన ఖర్జూరానికి ఉన్న ప్రాధాన్యత:

ఆయుర్వేద వైద్య నిపుణుల ప్రకారం, స్త్రీ, పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో వేయించిన ఖర్జూరం అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుంది. రాత్రి సమయంలో పడుకునే ముందు కేవలం రెండు వేయించిన ఖర్జూరాలు తినడం వల్ల శరీరానికి వెచ్చదనం లభిస్తుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరిచి, ప్రత్యుత్పత్తి అవయవాలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. అలాగే శరీరంలో వాత దోషాన్ని శాంతపరచడంలో సహాయపడి, హార్మోన్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

మహిళలకు వేయించిన ఖర్జూరం వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు:

హార్మోన్ల సమతుల్యత, అండాల నాణ్యత: వేయించిన ఖర్జూరంలో ఇనుము, ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఎండోక్రైన్ గ్రంథుల పనితీరును మెరుగుపరిచి, హార్మోన్లు సరిగ్గా విడుదల అయ్యేలా సహాయపడతాయి. దీనివల్ల నెలసరి క్రమబద్ధమవుతుంది. అండం విడుదల అయ్యే ప్రక్రియ మెరుగుపడుతుంది.

గర్భాశయం బలపడటం: చాలా మంది మహిళల్లో గర్భాశయం బలహీనంగా ఉండటం వల్ల గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంటుంది. వేయించిన ఖర్జూరం తినడం వల్ల గర్భాశయ కండరాలు బలంగా మారుతాయి, దీనివల్ల గర్భధారణ సురక్షితంగా నిలబడే అవకాశం పెరుగుతుంది.

రక్తహీనత నివారణ: ఖర్జూరంలో ఐరన్ శాతం అధికంగా ఉండటం వల్ల మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గి, హిమోగ్లోబిన్ స్థాయిలు గణనీయంగా పెరుగుతాయి.

ఎముకల బలం: ఇందులో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం, విటమిన్ కె వంటి పోషకాలు ఉండటం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి.

మహిళలు తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి సంతానోత్పత్తి సమస్యలను అధిగమించడానికి నిపుణుల సలహాతో రోజూ వేయించిన ఖర్జూరాన్ని తమ ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం.



స్టాక్ మార్కెట్ Stock Market

6 రోజుల శిశువుకు డీమాట్ అకౌంట్..

ఇటీవల ఆరు రోజుల వయసున్న శిశువు ఆర్యా గోయెల్ పేరిట ఆమె తల్లిదండ్రులు డీమాట్ అకౌంట్ ఓపెన్ చేశారు. దేశంలో అత్యంత పిన్నవయసున్న డిమాట్ అకౌంట్ హోల్డర్‌గా కొత్త రికార్డు సృష్టించింది.

ఇటీవల ఆరు రోజుల వయసున్న శిశువు ఆర్యా గోయెల్ పేరిట ఆమె తల్లిదండ్రులు డీమాట్ అకౌంట్ ఓపెన్ చేశారు. దేశంలో అత్యంత పిన్నవయసున్న డిమాట్ అకౌంట్ హోల్డర్‌గా కొత్త రికార్డు సృష్టించింది. 12 రోజుల శిశువుకు డిమాట్ అకౌంట్ పేరిట ఉన్న రికార్డును ఈ శిశువు అధిగమించింది. నడక నేర్చే ముందే ఆ శిశువు ఇన్వెస్ట్‌మెంట్‌ల ప్రపంచంలో కాలుపెట్టింది. మరీ రోజుల వయసున్న శిశువు పేరిట ఇలాంటి అకౌంట్స్ ఓపెన్ చేయడం కాస్త అరుదైన విషయమే అయినా ఈ కాలంలో అనేక మంది తల్లిదండ్రులు తమ చిన్న వయసులోనే పెట్టుబడులకు సిద్ధం అవుతున్న వైనాన్ని ఈ ఉదంతం సూచిస్తోందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు.

మైనర్లకు డీమాట్ అకౌంట్ ఓపెనింగ్ ఇలా..

మైనర్ల పేరిట డీమాట్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు ఆధార్ కార్డు, మైనర్లకు ఇచ్చే పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఉండాలి. ఆర్య గోయెల్ తల్లిదండ్రులు వీటిని రోజుల వ్యవధిలోనే సమకూర్చుకున్నారు. ఆర్య మేజర్ అయ్యే వరకూ ఆమె తరఫున తల్లిదండ్రులే పెట్టుబడులు పెడతారు. కూతురికి 18 ఏళ్ల వచ్చాక అకౌంట్‌ను ఆమెకు అప్పగిస్తారు. ఇటీవల కాలంలో అనేక మంది తమ సంతనం మైనర్లుగా ఉన్న సమయంలోనే వారి పేరిట స్టాక్‌మార్కెట్స్, మ్యూచువల్ ఫండ్స్‌లలో పెట్టుబడి పెడుతున్నారు. అంత కంతకూ పెరుగుతున్న విద్య, వైద్య ఖర్చుల నేపథ్యంలో ముందస్తు ప్లానింగ్ బెటరని భావిస్తున్నారు. దీర్ఘ కాలిక ఆర్థిక లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఇదే అత్యుత్తమ మార్గమని అంటున్నారు.

పిల్లల పేరిట డీమాట్ అకౌంట్ ఓపెన్ చేశాక ఇక అంతా సవ్యంగా సాగిపోతుందని అనుకోవడం పొరపాటని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రుల పెట్టుబడుల తీరుపై అంతిమంగా లాభాలు ఆధారపడి ఉంటాయి. మార్కెట్ ఆధారిత ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలతో వచ్చే రిస్కులను అర్థం చేసుకుని తల్లిదండ్రులు ముందడుగు వేయాలి. గతంలో కూడా అనేక మంది తమ సంతానానికి చిన్న వయసులోనే డీమాట్ అకౌంట్ ఏర్పాటు చేయగలిగారు. ఆర్థికంగా ఓ స్థిరమైన పునాది ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నామని ఆయా చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



మార్కెట్ స్పీడ్‌కు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్ల రెండు రోజుల వరుస లాభాలకు బుధవారం (నవంబర్ 18) బ్రేక్ పడింది. గత సెషన్‌లో దాదాపు తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయిల వద్ద ముగిసిన సూచీలు, నేడు గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో నష్టాల్లో ముగిశాయి. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, మెటల్, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ (BSE Sensex) 500.38 పాయింట్లు (0.61 శాతం) క్షీణించి 82,031.81 వద్ద స్థిరపడింది. ఉదయం 82,376.56 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, ఇంట్రాడేలో 81,780.47 కనిష్ఠ స్థాయిని తాకింది. మరోవైపు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ (Nifty 50) 159.45 పాయింట్లు (0.63 శాతం) నష్టపోయి 25,250 కీలక స్థాయి దిగువన, 25,227.95 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 25,141.80 కనిష్ఠానికి చేరింది. విస్తృత మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.42 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 0.17 శాతం లాభపడింది.

గరిష్ఠ స్థాయిల వద్ద లాభాల స్వీకరణ: నవంబర్ నెలలో ఇప్పటివరకు నిఫ్టీ 10.1 శాతం, సెన్సెక్స్ 10.8 శాతం మేర భారీగా పుంజుకున్నాయి. వరుస ర్యాలీ తర్వాత సాంకేతిక సూచీలు అధిక స్థాయికి చేరడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించేందుకు మొగ్గు చూపారు.

బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు: అమెరికా మార్కెట్లు గత సెషన్‌లో భారీ నష్టాలతో ముగిశాయి. డౌజోన్స్ 1.64 శాతం, ఎస్ అండ్ పీ 500 (S&P 500) 1.03 శాతం, నాస్‌డాక్ 0.74 శాతం చొప్పున పతనమయ్యాయి. దీని ప్రభావంతో ఆసియా మార్కెట్లయిన షాంఘై కాంపోజిట్, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు కూడా నష్టాల్లో ట్రేడయ్యాయి.

మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత పెంచవచ్చన్న అంచనాలతో డాలర్ విలువ బలపడింది. ఫలితంగా అంతర్జాతీయంగా లోహాల ధరలు తగ్గడంతో నిఫ్టీ మెటల్ సూచీ దాదాపు 2 శాతం క్షీణించింది. హిందుస్థాన్ జింక్ 3 శాతం నష్టపోగా, సెయిల్ (SAIL), నాల్కో (NALCO), హిందుస్థాన్ కాపర్ షేర్లు 2 నుంచి 3 శాతం మధ్య పతనమయ్యాయి.

ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఒత్తిడి: నవంబర్‌లో 14 శాతం మేర లాభపడిన ఫైనాన్షియల్ రంగ షేర్లలో నేడు 0.5 శాతం మేర లాభాల స్వీకరణ కనిపించింది. వెయిటేజీ ఎక్కువగా ఉండే ఈ రంగం బలహీనపడటం సూచీలను కిందకు లాగింది. అయితే,



రూ. 1,465 కోట్ల ఎన్‌హెచ్ఏఐ (NHAI) కాంట్రాక్టు దక్కించుకున్న అశోకా బిల్డ్‌కాన్ షేరు మాత్రం 8 శాతం ఎగబాకి 11 వారాల గరిష్ఠాన్ని తాకింది.

ఎంటీఎఫ్‌పై సెబీ పరిమితులు?

స్టాక్ మార్కెట్‌ను మరింత సంస్కరించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్ పై...

మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్‌పై సెబీ పరిమితులు?

స్టాక్ మార్కెట్‌ను మరింత సంస్కరించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్ (ఎంటీఎఫ్)పై పరిమితులు విధించాలని యోచిస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఒక చర్చా పత్రం విడుదల చేసి అందరి అభిప్రాయాల ఆధారంగా ఈ పరిమితులు విధించాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఇదే జరిగితే దాదాపు జూదంగా మారిన మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్‌కు కొంతలో కొంతైనా చెక్ పడుతుందని భావిస్తున్నారు.

ఎంటీఎఫ్ అంటే: ఈ పద్ధతిలో చేతిలో పెద్దగా నగదు లేకపోయినా షేర్లలో ట్రేడింగ్ చేయవచ్చు. మదుపరుల వద్ద ఉన్న నగదుకు నాలుగు రెట్ల నిధులను బ్రోకరేజీ సంస్థలు అప్పుగా ఇస్తాయి. ఇందుకు 9 నుంచి 18 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తాయి. బ్రోకరేజీ సంస్థలు ఈ మొత్తంతో మదుపరుల తరఫున షేర్లు కొని అమ్ముతుంటాయి. ఇందులో లాభం వస్తే వడ్డీ, ఖర్చులు పోను మిగిలిన మొత్తాన్ని మదుపరులకు చెల్లిస్తారు. నష్టం వస్తే మదుపరులు మార్జిన్‌గా ఉంచిన అసలుకు కూడా గండి పడుతుంది.

పరిమితులు ఎందుకు: ప్రస్తుతం మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్ దాదాపు రూ.1.53 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువ. ఇందులో మూడింట రెండు వంతుల ఫండింగ్..



స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలోనే జరిగింది. అనేక మంది రిటైల్ మదుపరులు ఈ కంపెనీల షేర్లలో మార్జిన్ ట్రేడింగ్ చేసి చేతులు కాల్చుకుంటున్నారు. దీంతో ఈ తరహా ట్రేడింగ్‌ను మొత్తంగా నిషేధించకుండా మార్జిన్ ట్రేడింగ్ ఫండింగ్‌ను, చలామణిలో ఉన్న ఆయా కంపెనీల షేర్ల (ఫ్రీ ఫ్లోటింగ్)లో 5 నుంచి 10 శాతం మించకుండా పరిమితులు విధించాలని సెబీ యోచిస్తున్నట్టు సమాచారం.

బీరంగూడ గుట్టపై ఆధ్యాత్మిక శోభ

ఈరోజు నుంచి శ్రీ అయ్యప్ప స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు



అమీన్‌పూర్, నవంబర్ 18 (సింగిడి) :
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో, గుట్టపై ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సర కార్తీక శుద్ధ ఏకాదశి (నవంబర్ 20) నుండి త్రయోదశి (నవంబర్ 22) వరకు త్రయాహ్నిక దీక్షగా శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి యంత్ర, విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బసవకళ్యాణ్ శ్రీగురు మదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ యతి వరేణ్యులు శ్రీ సదానంద మఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి పవిత్ర కరకమలములచే ఈ మహా ప్రతిష్ఠా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతోంది. ఈ నేపథ్యంలో ఈరోజు (నవంబర్ 19) నుండే ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తుల ఐక్యతకు నిదర్శనం ఈ ఆలయం:గత ఏడాది కాలంగా ఎంతో నిష్ఠతో, పట్టుదలతో సాగిన ఈ ఆలయ నిర్మాణం వెనుక వేలాది మంది భక్తుల శ్రమ, దాతల ఔదార్యం దాగి ఉంది. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు, అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని కాలనీవాసులు, అయ్యప్ప మాలధారులు, స్థానిక నాయకులు అందరూ ఏకమై ఈ ఆలయ నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా పూర్తి చేశారు. రేపటి నుండి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.రోజువారీ పూజా కార్యక్రమాల పూర్తి వివరాలు:నవంబర్ 19 (గురువారం – శోభాయాత్ర): ఈరోజు సాయంత్రం 5:00 గంటలకు బీరంగూడ కమాన్ నుండి గుట్టపై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం వరకు ప్రతిష్ఠా మూర్తుల ఊరేగింపు (శోభాయాత్ర / గ్రామోత్సవం) భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా జరుగుతుంది.నవంబర్ 20 (శుక్రవారం – మొదటి రోజు): ఉదయం 6:30 గంటలకు మంగళవాద్య సేవ, వేదపారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచగవ్య మేళనం, దీక్షాధారణ, అంకురారోపణ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన జరుగుతాయి. అనంతరం వాస్తు, క్షేత్రపాల, నవగ్రహ, సర్వతోభద్ర మండల పూజలు, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠా, గణపతి హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 6:00 గంటలకు ఆలయ సర్వదేవతా మూర్తులకు మహాస్నపనం, 108 ఓషధీకలశ జలములచే అభిషేకం, పంచామృతాధివాసం, పంచగవ్యాధివాసం మరియు జలాధివాస కార్యక్రమాలు జరుగుతాయి. నవంబర్ 21 (శనివారం – రెండవ రోజు): ఉదయం 6:30 గంటలకు మంగళవాద్య సేవ, వేదపారాయణం, గోపూజ, యాగశాల మండప ఆవాహిత దేవతా పూజలు, పంచసూక్త, శ్రీ రుద్రహోమాలు, శ్రీ అయ్యప్ప స్వామి వారి మూలమంత్ర హోమాలు మరియు యంత్ర అధిష్ఠాన దేవతా మూల మంత్రహోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6:00 గంటలకు ఆలయ సర్వ దేవతా మూర్తులకు ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం, శయ్యాధివాసం మరియు నిద్రాకళశస్థాపన పూజలు జరుగుతాయి. నవంబర్ 22 (ఆదివారం – మహా ప్రతిష్ఠా మహోత్సవం): ఉదయం 6:00 గంటలకు గోపూజ, మూల మంత్రహోమాలు, గర్భన్యాసం, యంత్ర న్యాసం, రత్ననాసం, బీజన్యాసం నిర్వహిస్తారు. అనంతరం అశ్విని నక్షత్ర యుక్త ధనుర్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున ఉదయం 9:49 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి దివ్య హస్తాలతో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి యంత్ర, విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఆ తర్వాత స్వామి వారి అనుగ్రహ భాషణం, కళాన్యాసం, ప్రాణప్రతిష్ఠ, అలంకార సేవ, నేత్రోన్మీలనం, రాజోపచార పూజ మరియు మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబర్ 23 (సోమవారం – శాంతి కళ్యాణం & పడిపూజ): ఉదయం 10:00 గంటలకు లోకకళ్యాణార్థం శ్రీ పార్వతీ పరమేశ్వరుల శాంతి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. సాయంత్రం 5:00 గంటలకు ఆలయ ఏకశిల పదునెట్టాంబడి (18 మెట్లు) పడిపూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ప్రత్యేక మండల పూజ (నూతన సంవత్సరం): దీక్షకు 41వ రోజైన జనవరి 1, 2027 (శుక్రవారం) నూతన సంవత్సరం రోజున ఉదయం 7:00 గంటల నుండి ఆలయ మండల పూజ మరియు సాయంత్రం 5:00 గంటలకు ప్రత్యేక పడిపూజ కార్యక్రమం జరగనుంది. అన్నప్రసాద వితరణ: ఉత్సవాలు జరిగే ప్రతిరోజూ పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థ, మహా అన్నప్రసాద వితరణ ఉంటుంది."స్వామియే శరణం అయ్యప్ప! బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈరోజు నుండి ఎంతో వైభవంగా ప్రారంభం కానున్నాయి. గత సంవత్సర కాలంగా ఈ ఆలయ కట్టడం ఇంత అద్భుతంగా పూర్తి కావడానికి ఎంతో మంది కృషి ఉంది. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు, అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ప్రజలు, స్థానిక కాలనీవాసులు, అయ్యప్ప స్వాములు, భక్తులు అందరూ ఎంతో సహకరించారు. అలాగే ఈ ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే గారికి, ప్రజాప్రతినిధులకు, పార్టీలకతీతంగా సహాయం అందించిన రాజకీయ నాయకులకు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులకు మరియు తమ వంతు విరాళాలు అందించిన దాతలందరికీ ఆలయ కమిటీ తరపున పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. అందరి సహకారంతో నిర్మించుకున్న ఈ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని మనమందరం కలిసి పండుగలా జరుపుకోవాలి. కావున రేపటి శోభాయాత్ర నుండి ప్రారంభమై, ఈ నెల 22న జరిగే ప్రధాన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, 23న జరిగే 18 మెట్ల పడిపూజ మరియు జనవరి 1న నూతన సంవత్సరం రోజున జరిగే మండల పూజ కార్యక్రమాలన్నింటిలో భక్తులు, కాలనీవాసులు, ప్రజలు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము.

గవర్నర్‌తో శాసనసభ స్పీకర్ భేటీ



హైదరాబాద్, నవంబర్ 18, (సింగిడి):
తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

చదువుతోపాటు హస్తకళల్లోనూ రాణించాలి



నాగర్ కర్నూల్, నవంబర్ 18 (సింగిడి):
విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న హస్తకళలు, చిత్రలేఖనం వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ అధికారిణి ఆర్. పరమేశ్వరి సూచించారు. విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థినీ విద్యార్థులకు హస్తకళలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే మట్టి, రాళ్లు, చెట్లు తదితర వనరులతో అనేక అందమైన కళారూపాలను తయారు చేయవచ్చన్నారు. ప్రస్తుతం నిరుద్యోగ సమస్య పెరుగుతున్న నేపథ్యంలో స్వయం ఉపాధి రంగాలకు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. యువత తమలోని సృజనాత్మకతకు పదునుపెట్టి, నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాల సమయంతో పాటు ఖాళీ సమయంలో గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతోపాటు కళలు, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇస్తే వ్యక్తిగత అభివృద్ధితో పాటు భవిష్యత్తులో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కల్పన, శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది కర్నె వెంకటేష్, తాజుద్దీన్, కమర్, శ్రీకాంత్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 18(సింగిడి) :
ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నార. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్ నినో లేదని బీఆర్ఎస్ నాయకులు అంటుండడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవాచేశారు. ఎల్ నినో ప్రభావంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు లేదనడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్దిచెప్పారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మా ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు మహేందర్, నాయకులు టంకర కృష్ణయ్య, రఘునాయక్, నవనీత, నర్సింలు, లింగం నాయక్, గోవింద్ యాదవ్, వెంకటయ్య, నవనీత, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 59వ గ్రంథాలయ వారోత్సవాలు

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న 150 మంది విద్యార్థులు



ఖమ్మం, నవంబర్ 18(సింగిడి):
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చైర్మన్ ఎండి ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా వ్యాస రచన పోటీలు ఉత్సాహభరిత 150 మందిభాగస్వామ్యం. అయ్యారు, గురువారం
ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం , ఖమ్మంలో పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ రచనా ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ★జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా★ మాట్లాడుతూ, విద్యార్థులలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని ప్రోత్సహించడం, భాషా పరిజ్ఞానాన్ని మరియు రచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు పుస్తక పఠనానికి కూడా సమయం కేటాయించాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాస రచన పోటీలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి చక్కని వేదికగా నిలుస్తాయని, చిన్న వయస్సు నుంచే చదవడం, రాయడం అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని చైర్మన్ పేర్కొన్నారు. విద్యార్థుల నుంచి లభించిన స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధితో పాటు విద్యార్థులు, యువతలో విజ్ఞానాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-I గ్రంథపాలకులు సి. మాల్యూర్, గ్రేడ్-III గ్రంథపాలకులు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర గ్రంథాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేష్‌నీ మర్యాద పూర్వకంగా కలిసిన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కల్వకుర్తి నవంబర్ 18 (సింగిడి):
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసంతో గిరిజన సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వి. హనుమ నాయక్ బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. తన అనుచరులు, మద్దతుదారులతో కలిసి త్వరలో గులాబీ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్టీ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్‌ను హనుమ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలో చేరాలన్న తన నిర్ణయాన్ని ఆయన ఉప్పల వెంకటేష్‌కు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆయన పాలనలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో జరిగిన కృషిని గుర్తించి బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు హనుమ నాయక్ వెల్లడించినట్లు తెలిపారు.హనుమ నాయక్ తన అనుచరులు, మద్దతుదారులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు రావడంపై ఉప్పల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమ నాయక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఆయన బృందం బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో హనుమ నాయక్ చేరికతో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, హనుమ నాయక్ అనుచరులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంప వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

బోధన్ ప్రతినిధి, నవంబర్ 18:(సింగిడి)
సాలురా గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పెన్షన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత పెన్షన్లను అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య రవి, పి అర్ టి యు మాజీ జిల్లా అధ్యక్షులుఇళ్తేపు శంకర్, సొసైటీ చైర్మన్ అల్లే రమేష్, మాజీ చైర్మన్లు అల్లే జనార్ధన్, శివకాంత్ పటేల్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 30న పట్టభద్రుల ఓటరు తుది జాబితా

నాగర్ కర్నూల్ నవంబర్ 18 (సింగిడి)
పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు.
పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు జాబితా డి-నోవో (కొత్తగా) రూపకల్పనలో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలోని నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు 43,653 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అందిన దరఖాస్తుల్లో 43,598 దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించగా, మరో 55 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. పెండింగ్ దరఖాస్తులను సైతం నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.
జిల్లాలో ఈ నెల 25వ తేదీన పట్టభద్రుల ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం అభ్యంతరాలు, ఇతర తదుపరి ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేసి, డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.
ఓటరు జాబితా కొత్తగా రూపొందించే ప్రక్రియలో భాగంగా పట్టభద్రుల నమోదుకు ఫారం-18, ఉపాధ్యాయుల నమోదుకు ఫారం-19 ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సహా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల విద్యార్హతలు, సాధారణ నివాసం, ఉపాధ్యాయుల



బోధనా అనుభవం, సంబంధిత విద్యాసంస్థల ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారిస్తున్నట్లు పేర్కొన్నారు.
అర్హులైన ప్రతి పట్టభద్రుడు, ఉపాధ్యాయుడికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బహిరంగ ప్రకటనలు, వార్తాపత్రికల ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు విద్యాసంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాల సహకారం తీసుకుంటున్నట్లు వివరించారు. సామూహికంగా సమర్పించిన దరఖాస్తులను సైతం ఒక్కొక్కటిగా స్వతంత్రంగా ధ్రువీకరించిన తర్వాతే ఆమోదిస్తున్నట్లు తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఎన్నికల విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమాతో ఆర్థిక భరోసా



నాగర్‌కర్నూల్ నవంబర్ 18 (సింగిడి):
రాష్ట్రంలోని ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై సమీక్షించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ దేవసహాయం, సీపీఓ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు.

కైలాసం గుట్టపై హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

కల్వకుర్తి నవంబర్ 18 (సింగిడి):
కల్వకుర్తి ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఐకృత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశమైన కైలాసగుట్టపై భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులతో రెండు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు.కైలాసగుట్టను దర్శించుకునేందుకు నిత్యం భక్తులు వస్తుంటారు. అయితే రాత్రి వేళల్లో గుట్ట పరిసర ప్రాంతాల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, వారి సౌకర్యార్థం రెండు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో కైలాసగుట్ట పరిసర ప్రాంతాలకు నూతన వెలుగులు వచ్చాయి. రాత్రి వేళల్లో సైతం భక్తులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు ఈ ఏర్పాట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని తన బాధ్యతగా భావిస్తానని తెలిపారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కైలాసగుట్ట అభివృద్ధికి భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.కాగా, కైలాసగుట్టపై రెండు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పట్ల ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల అవసరాలను గుర్తించి సొంత నిధులతో వెలుగులు ఏర్పాటు చేయించడం అభినందనీయమని కొనియాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో భాగంగా ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం మరింత మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో, పురం శేఖర్ రెడ్డి, బావాండ్ల మధు, సూరం తిరుపతి రెడ్డి, రఘు యాదవ్ స్వామి, కుడుముల శేఖర్ రెడ్డి, సాధు మురళీధర్ రెడ్డి, సురేష్ గౌడ్, అర్చకుడు వేణుగోపాల్, దామర్ల శేఖర్, పురం మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయిజలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



గద్వాల ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి):
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పెన్షన్లు మంజూరు చేసిన సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ కూడలిలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వారికి ఈ పెన్షన్లు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అయిజ మున్సిపాలిటీతో పాటు అయిజ మండలంలో కూడా పెద్ద సంఖ్యలో నూతన పెన్షన్లు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ల మంజూరుకు కృషి చేసిన ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్, ఎంపీ మల్లు రవి, మంత్రి సీతక్కలకు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా పెన్షన్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం సకాలంలో పెన్షన్ అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, సింగిల్ విండో అధ్యక్షురాలు సుజాత రాముడు, సింగల్ విండో వైస్ చైర్మన్ దేవేందర్,కౌన్సిలర్లు మద్దిలేటి, సులోచనమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడేసాబ్, మైసర్ బాబు మహబూబ్ బాషా,స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు



కల్వకుర్తి నవంబర్ 18 (సింగిడి):
నాగర్‌కర్నూల్: బీసీ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా గండికోట రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను బీసీ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా గండికోట రాజుకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించేందుకు సంఘం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు.
జిల్లాలో బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, బీసీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని నూతన అధ్యక్షుడు గండికోట రాజుకు నాయకులు సూచించారు. బీసీల ఐక్యత, హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా గండికోట రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘం అభివృద్ధికి, బీసీల హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గండికోట రాజుకు పలువురు బీసీ సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్, సంఘం నాయకులు మేకల రాజేందర్, నాకినమోని రాములు యాదవ్, దుర్గాప్రసాద్, కౌన్సిలర్ బోడ నరసింహా, దార మోని గణేష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ



గద్వాల ప్రతినిధి నవంబర్ 18 (సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పంపిణీ చేశారు. అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదిక వద్ద గ్రామీణ ప్రాంతాల లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్‌పర్సన్ సుజాత రాముడు పాల్గొన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులకు పింఛన్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో పింఛన్లు అందిస్తోందని నాయకులు పేర్కొన్నారు. పింఛన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానోత్సవం



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి) :
నగరంలోని సుభాష్‌నగర్ లోని నారాయణ పాఠశాల విద్యార్థులకు పాలిటెక్నిక్ గ్రౌండ్ లో నిర్వహించిన వివిధ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. మంగళ, బుధవారాల్లో నారాయణ పబ్లిక్ స్కూల్ ఈ చాంప్స్ పేరిట క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు పాఠశాల ఆవరణలో విద్యా సంస్థల ఏజీఎం సూర్యవంశీ శివాజి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, తల్లిదండ్రుల సమక్షంలో పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.చందన విద్యార్థులను అభినందిస్తూ, చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల విజయాలను ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

రైతు ప్రయోజనాలకే పెద్దపీట

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.



ఖమ్మం, నవంబర్ 18(సింగిడి):
రాష్ట్ర వ్యవసాయ రంగంలో తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతికి జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు లభించిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం (SASCI) పథకం కింద ప్రత్యేక కేంద్ర సహాయం (SCA) రూపంలో రూ.1,087.64 కోట్ల నిధులను అందుకుని దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అమలు చేసిన వినూత్న విధానాలు, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా సాధించిన పురోగతికి ఈ గుర్తింపు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సేవలను రైతులకు మరింత చేరువ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు అందించే సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతికి కేంద్రం నుంచి ఈ ప్రోత్సాహకం లభించిందని మంత్రి అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి రైతుల ఫార్మర్ ఐడీలను నమోదు చేసినందుకు గాను రూ.422.64 కోట్ల ప్రత్యేక కేంద్ర సహాయ నిధులను కేంద్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 26న విడుదల చేసిందని మంత్రి వివరించారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ఎరువుల యాప్ ద్వారా ఎరువుల పంపిణీని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేసినందుకు వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆమోదించిన రూ.665 కోట్ల ప్రోత్సాహక నిధులు మూడు విడతల్లో పూర్తిగా విడుదలయ్యాయని తెలిపారు. మొదటి విడతలో రూ.175 కోట్లు, రెండో విడతలో రూ.165 కోట్లు, మూడో విడతలో రూ.325 కోట్లు అందాయని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ విధంగా రెండు ఆర్థిక సంవత్సరాలకు కలిపి తెలంగాణ రాష్ట్రానికి మొత్తం రూ.1,087.64 కోట్ల ప్రత్యేక కేంద్ర సహాయం లభించిందని వెల్లడించారు. సీఎం శ్రీ రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, తన నిరంతర పర్యవేక్షణలో వ్యవసాయశాఖ కార్యదర్శి, వ్యవసాయశాఖ సంచాలకులు, కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులు, జిల్లాస్థాయి అధికారులు, క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా చేరుకోగలిగామని మంత్రి తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్18 (సింగిడి) :
రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ తెలిపారు. నగరంలోని 34, 39వ డివిజన్లలో బుధవారం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేంద్ర నిధులతో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ కేటాయించాలని, దీంతో మరిన్ని పనులు ముందుకు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నాయకులు సాయిరాం, పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కంపౌండ్ లో పాఠశాల ఆకస్మిక తనిఖీ

నగరంలోని మిర్చి కంపౌండ్ లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన చేస్తుండగా పరిశీలించారు. అయితే మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నాణ్యత ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

గడువులోగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేస్తాం



మహబూబ్ నగర్, నవంబర్ 18(సింగిడి):
హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను నిర్దీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు.
బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారుల(ఈఆర్ఓలు)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా పునఃరూపకల్పన (డి నోవో) ప్రక్రియలో భాగంగా చేపడుతున్న చర్యలను వివరించారు.
సమావేశంలో డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేటురు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, కచ్చితత్వం పాటిస్తూ, ప్రక్రియను నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో ఫారం-18 దరఖాస్తుల స్థితిగతులు, పరిశీలన పురోగతిని డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం నియమ నిబంధనల అనుసారంగా పరిశీలించి, నిర్దీత గడువులోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
మహబూబ్‌నగర్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఇప్పటివరకు మొత్తం 45,477 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో వచ్చిన దరఖాస్తులతో పోలిస్తే ఈసారి సుమారు 10 వేల దరఖాస్తులు అదనంగా వచ్చినట్లు తెలిపారు.
వీటిలో సుమారు 1,600 దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా మరో రెండు రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ, దరఖాస్తుల పరిశీలనలో నాణ్యతతో పాటు నిర్దీత సమయంలో పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ ఈ నెల 20వ తేదీలోగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్.డి.ఓ నవీన్, డి.టి. జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్లు పంపిణీ

ఆర్మూర్, నవంబర్ 18 (సింగిడి) :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19,నుండి ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకం, నూతన పెన్షన్ల పంపిణీ, బతుకమ్మ చీరాల పంపిణీ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని, ఇట్టి పథకాలను మోర్తాడ్ గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోర్తాడ్ గ్రామపంచాయతీ (ఈ.వో) కార్యదర్శి సైపుద్దీన్ బుధవారం రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. ఇందిరమ్మ ఆరోగ్య బీమా పథకం కోసం రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కుటుంబం ఐదు లక్షల బీమా ప్రభుత్వం అమలు చేసిందని, అట్టి పథకానికి ప్రతి కుటుంబ లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని గ్రామపంచాయతీకి వస్తే, గ్రామపంచాయతీ అధికారులు ప్రభుత్వం జారీ చేసిన నిబంధన మేరకు దరఖాస్తులను గ్రామపంచాయతీలో స్వీకరిస్తారని కార్యదర్శి వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన పెన్షన్లను సైతం మంజూరైన వారికి మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ చీరలను సైతం పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను అందజేసే పూర్తి వివరాలను మండల అధికారులు తెలియజేసిన వెంటనే గ్రామ ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. గురువారం రోజు నుండి ఇందిరమ్మ బీమా పథకం ప్రతి కుటుంబ సభ్యులు చేసుకోవాలని కార్యదర్శి సైపుద్దీన్ కోరారు.

విద్యార్థులకు షీటీమ్స్ అవగాహన సదస్సు



ఆర్మూర్, నవంబర్ 18 (సింగిడి) :
బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని దొనకల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ. టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ.టీమ్స్ ప్రతినిధుల బృందం అధికారులు విగ్నేష్, సుకన్య లు మాట్లాడుతూ, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్, మహిళల భద్రత, బాలికల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండ, సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని వారు అవగాహన సదస్సులో తెలియజేశారు. తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, 8712659795 నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి మహిళా బాధితులకు, యువతులకు సకాలంలో పోలీసులు విచ్చేసి రక్షణ కల్పిస్తారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోపారం మోహన్, ఉపాధ్యాయ బృందం సభ్యులు,గంగమణి,సురేష్,రాజ్ నారాయణ్,రఘునాథ్,సవిత,కిరణ్,భోజన్నా తదితరులు, పాల్గొన్నారు. విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు



గుమ్మడిదల నవంబర్ 18 (సింగిడి):
గుమ్మడిదల: పటాన్‌చెరు నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం గుమ్మడిదల టోల్‌గేట్ సమీపంలోని జీవన్‌ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు చేతుల మీదుగా నియోజకవర్గ పరిధిలో కొత్తగా పింఛన్లు మంజూరైన 3,350 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో ఆయా కుటుంబాలకు నెలవారీ ఆర్థిక భరోసా లభించనుంది. ఈ సందర్భంగా మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించాలి



నాగర్ కర్నూల్ నవంబర్ 18 (సింగిడి):
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రతి అర్హత కలిగిన పౌరుడు బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఈ సందర్భంగా సూచించారు.
ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు హక్కు విశిష్టతపై చిన్నప్పటినుండే విద్యార్థుల్లో చైతన్యం కల్పించడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన పెంపొందించే ఉద్దేశంతో బుధవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాల్సిన అంశాలను తమ రచనలు, చిత్రాల ద్వారా చక్కగా వ్యక్తీకరించారు.
పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమంగా ఎంపికైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, ఓటు హక్కు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడికి ఉన్న ముఖ్యమైన బాధ్యత అని వివరించారు.
భారత రాజ్యాంగం అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే ముఖ్యమైన సాధనం ఓటు అని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలంటే ముందుగా అర్హులైన వారందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండటం అవసరమని తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, అర్హత కలిగిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.
ప్రతి పాఠశాలలో నిర్వహించే 'చునావ్ పాఠశాలల' కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పాఠశాలల్లో తెలుసుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పాటు నిరక్షరాస్యులైన వయోజనులకు కూడా ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించాలని కోరారు.
ఓటరు జాబితాలో పేర్ల నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే వరకు ప్రతి దశపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు కూడా కీలక పాత్రపోషించాలని, విద్యార్థుల ద్వారా కుటుంబాల్లో, తద్వారా సమాజంలో ఓటు హక్కుపై చైతన్యం పెంపొందించవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు.
ఇలాంటి వ్యాసరచన, చిత్రలేఖన పోటీల నిర్వహణ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల అవగాహన, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, విద్యాశాఖ అధికారులు నిర్మల, పరమేశ్వర్ వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థిని తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడ గుట్టపై ఆధ్యాత్మిక శోభ

నేటినుంచి అయ్యప్పస్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు!

అమీన్‌పూర్, నవంబర్ 18 (సింగిడి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో, గుట్టపై ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సర కార్తీక శుద్ధ ఏకాదశి (నవంబర్ 20) నుండి త్రయోదశి (నవంబర్ 22) వరకు త్రయాహ్నిక దీక్షగా శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి యంత్ర, విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బసవకళ్యాణ్ శ్రీగురు మదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ యతివరేణ్యులు శ్రీ సదానంద మఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి పవిత్ర కరకమలములచే ఈ మహా ప్రతిష్ఠా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతోంది. ఈ నేపథ్యంలో ఈరోజు (నవంబర్ 19) నుండే ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.



భక్తుల ఐక్యతకు నిదర్శనం ఈ ఆలయం:
గత ఏడాది కాలంగా ఎంతో నిష్ఠతో, పట్టుదలతో సాగిన ఈ ఆలయ నిర్మాణం వెనుక వేలాది మంది భక్తుల శ్రమ, దాతల ఔదార్యం దాగి ఉంది. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు, అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని కాలనీవాసులు, అయ్యప్ప మాలధారులు, స్థానిక నాయకులు అందరూ ఏకమై ఈ ఆలయ నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా పూర్తి చేశారు. రేపటి నుండి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

రోజువారీ పూజా కార్యక్రమాల పూర్తి వివరాలు:
నవంబర్ 19 (గురువారం – శోభాయాత్ర): ఈరోజు సాయంత్రం 5:00 గంటలకు బీరంగూడ కమాన్ నుండి గుట్టపై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం వరకు ప్రతిష్ఠా మూర్తుల ఊరేగింపు (శోభాయాత్ర/గ్రామోత్సవం) భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా జరుగుతుంది. ?నవంబర్ 20 (శుక్రవారం – మొదటి రోజు): ఉదయం 6:30 గంటలకు మంగళవాద్య సేవ, వేదపారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచగవ్య మేళనం, దీక్షాధారణ, అంకురారోపణ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన జరుగుతాయి. అనంతరం వాస్తు, క్షేత్రపాల, నవగ్రహ, సర్వతోభద్ర మండల పూజలు, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠా, గణపతి హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 6:00 గంటలకు ఆలయ సర్వదేవతామూర్తులకు మహాస్నపనం, 108 ఓషధీకలశ జలములచే అభిషేకం, పంచామృతాధివాసం, పంచగవ్యాధివాసం మరియు జలాధివాస కార్యక్రమాలు జరుగుతాయి. ?నవంబర్ 21 (శనివారం – రెండవ రోజు): ఉదయం 6:30 గంటలకు మంగళవాద్య సేవ, వేదపారాయణం, గోపూజ, యాగశాల మండప ఆవాహిత దేవతా పూజలు, పంచసూక్త, శ్రీ రుద్రహోమాలు, శ్రీ అయ్యప్ప స్వామి వారి మూలమంత్ర హోమాలు మరియు యంత్ర అధిష్ఠాన దేవతా మూల మంత్రహోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6:00 గంటలకు ఆలయ సర్వ దేవతా మూర్తులకు ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం, శయ్యాధివాసం మరియు నిద్రాకళశస్థాపన పూజలు జరుగుతాయి. ?నవంబర్ 22 (ఆదివారం – మహా ప్రతిష్ఠా మహోత్సవం): ఉదయం 6:00 గంటలకు గోపూజ, మూల మంత్రహోమాలు, గర్భన్యాసం, యంత్ర న్యాసం, రత్ననాసం, బీజన్యాసం నిర్వహిస్తారు. అనంతరం అశ్విని నక్షత్ర యుక్త ధనుర్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున ఉదయం 9:49 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి దివ్య హస్తాలతో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి యంత్ర, విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఆ తర్వాత స్వామి వారి అనుగ్రహ భాషణ, కళాన్యాసం, ప్రాణప్రతిష్ఠ, అలంకార సేవ, నేత్రోన్మీలనం, రాజోపచార పూజ మరియు మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ?నవంబర్ 23 (సోమవారం – శాంతి కళ్యాణం ఉ పడిపూజ): ఉదయం 10:00 గంటలకు లోకకల్యాణార్థం శ్రీ పార్వతీ పరమేశ్వరుల శాంతి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. సాయంత్రం 5:00 గంటలకు ఆలయ ఏకశిల పదునెట్టాంబడి (18 మెట్లు) పడిపూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ?ప్రత్యేక మండల పూజ (నూతన సంవత్సరం): దీక్షకు 41వ రోజైన జనవరి 1, 2027 (శుక్రవారం) నూతన సంవత్సరం రోజున ఉదయం 7:00 గంటల నుండి ఆలయ మండల పూజ మరియు సాయంత్రం 5:00 గంటలకు ప్రత్యేక పడిపూజ కార్యక్రమం జరగనుంది. అన్నప్రసాద వితరణ: ఉత్సవాలు జరిగే ప్రతిరోజూ పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థ, మహా అన్నప్రసాద వితరణ ఉంటుంది."స్వామియే శరణం అయ్యప్ప! బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈరోజు నుండి ఎంతో వైభవంగా ప్రారంభం కానున్నాయి. గత సంవత్సర కాలంగా ఈ ఆలయ కట్టడం ఇంత అద్భుతంగా పూర్తి కావడానికి ఎంతో మంది కృషి ఉంది. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు, అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ప్రజలు, స్థానిక కాలనీవాసులు, అయ్యప్ప స్వాములు, భక్తులు అందరూ ఎంతో సహకరించారు. అలాగే ఈ ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే గారికి, ప్రజాప్రతినిధులకు, పార్టీలకతీతంగా సహాయం అందించిన రాజకీయ నాయకులకు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులకు మరియు తమ వంతు విరాళాలు అందించిన దాతలందరికీ ఆలయ కమిటీ తరపున పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. అందరి సహకారంతో నిర్మించుకున్న ఈ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని మనమందరం కలిసి పండుగలా జరుపుకోవాలి. కావున రేపటి శోభాయాత్ర నుండి ప్రారంభమై, ఈ నెల 22న జరిగే ప్రధాన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, 23న జరిగే 18 మెట్ల పడిపూజ మరియు జనవరి 1న నూతన సంవత్సరం రోజున జరిగే మండల పూజ కార్యక్రమాలన్నింటిలో భక్తులు, కాలనీవాసులు, ప్రజలు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము.

– (శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, బీరంగూడ)

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో, మస్కట్ పోస్టర్ ఆవిష్కరణ



రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ -- 2026'కు సంబంధించిన లోగో, మస్కట్ పోస్టర్‌ను బుధవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మన రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని అన్నారు. యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి, వారిలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్, ఖో-ఖో పోటీలు

ఈ మెగా క్రీడా ఈవెంట్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్, ఖో-ఖో పోటీలను నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత వెల్లడించారు. ఈ పోటీలపై ముఖ్యంగా విద్యార్థులు, యువతలో విస్తృత అవగాహన కల్పించి, వారిలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, సరూర్ నగర్ స్టేడియం వేదిక ఇన్‌చార్జి కె. అనూష, సూపరింటెండెంట్ సత్యనారాయణ మూర్తి, ఎం. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్.. మోడిఫైడ్ సైలెన్సర్ల స్వాధీనం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (సింగిడి): ద్విచక్ర వాహనాలకు కంపెనీ అమర్చిన సైలెన్సర్లను తొలగించి, అధిక శబ్దాలు వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకుని రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మోడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సుమారు 200 ద్విచక్ర వాహనాలను గుర్తించి, మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. ఆయా వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సుమారు 200 సైలెన్సర్లను ఈ రోజు రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యయ్య గౌడ్ మాట్లాడుతూ.. వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకుని పెద్ద శబ్దాలతో రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం సహించేది లేదని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను గుర్తించి సైలెన్సర్లను తొలగించడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడం, రోడ్లపై క్రమశిక్షణను పెంపొందించడం పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, రూరల్ సీఐ నయీముద్దీన్, టౌన్ సీఐ రాము నాయుడు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు మూడేళ్లు.. కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు!

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (సింగిడి): గొప్పగా చెప్పుకున్న అభయహస్తం.. హామీలను అమలు చేయని మొండి హస్తంగా మారింది అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. మేనిఫెస్టో మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని, దానిని తూచా తప్పకుండా అమలు చేస్తామని మూడేళ్ల మల్లికార్జున ఖర్గే గారి సమక్షంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, మూడేళ్లు గడిచినా ఆ హామీలకు దిక్కులేదు. అమలు ఊసే లేదు. అభయ హస్తం.. శూన్య హస్తం అయ్యిందన్నారు. ఓట్లు వేసిన ప్రజలనే కాదు.. ఒట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని, గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. అలాగే ఖర్గే , రేవంత్ రెడ్డి , మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు,భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన సవాల్ విసిరారు.తొలి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలింది. ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా.. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదన్నారు.మేనిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, హామీల అమలును గాలికొదిలేసారని, ఆరు గ్యారెంటీలు 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారని విమర్శించారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్.. గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేక పోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి చూస్తే గాంధీ ఆత్మ కూడా క్షోభిస్తుందని,ప్రజల ఆశలను ఓట్లుగా మార్చుకున్నారని, అధికారాన్ని అందుకున్నాక ఆ ఆశలను ఆవిరి చేశారని,హామీలు అమలు చేయకుండా మూడేళ్లుగా ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనత , కాంగ్రెస్ మాయమాటలను, నయవంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇక మిగిలింది తగిన గుణపాఠం చెప్పడమే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి, చేసిన ప్రతి మోసానికి కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రాధాన్యత క్రమంలో పటాన్‌చెరు సమగ్రాభివృద్ధి

- అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లలో రూ. 3.33 కోట్ల పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన
- నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత..
- ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి పనుల ప్రారంభం



అమీన్‌పూర్, నవంబర్ 18(సింగిడి): ప్రజల మౌలిక అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో నియోజక వర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వడకపల్లి, పటేల్ గూడ, ఎన్ఎస్ఎల్ కాలనీ, మండే మార్కెట్, తులసి వనం కాలనీలలో రూ. 3.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శాసనమండలి సభ్యులు అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా, ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన వసతులను కల్పించడమే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నామని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు సమన్వయంతో పనిచేస్తూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, పారిశ్రామిక సంస్థల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా కూడా నియోజకవర్గంలో నూతన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని వివరించారు. ప్రజల సహకారంతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో అమీన్‌పూర్ ఉప కమిషనర్ లలితా శ్రావణి, డీఈ వెంకటరమణ, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్ , మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి, చంద్రశేఖర్, యూనుస్, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, జగదీష్, సునీత రాజేష్ గౌడ్, శ్రీకాంత్, దాసు యాదవ్, యూసుఫ్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా 6,685 మందికి పింఛన్లు మంజూరు

శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



కుత్బుల్లాపూర్, నవంబర్ 18 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (కాంగ్రెస్) ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కేవీఆర్ గార్డెన్స్ (కొంపల్లి) నందు అర్హులైన నిరుపేదలకు నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా మరో 6,685 మందికి పింఛన్లు మంజూరు చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కొంపల్లిలోని కేవీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నూతన పింఛన్ల మంజూరుతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని చేసుకున్నారు. నియోజకవర్గం చింతల్ – 1,657, దుండిగల్ – 793, గాజులరామారం – 1,214, కొంపల్లి – 1,465, నిజాంపేట మున్సిపల్ పరిధిలో 520, కుత్బుల్లాపూర్ – 1,036, మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. డిసెంబర్ నెల నుండి, 6,685 మంది లబ్ధిదారుల ఖాతాలకు పెన్షన్ ఇంకిస్తామని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ (ఐఏఎస్), డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ గార్లతో, లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారులి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారు, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, ఐ ఎన్ టి యు సి, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్రంలో ప్రతి నిరుపేద సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలు



- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి): రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కెవిఆర్ గార్డెన్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని శ్రీ సీతారామ కళ్యాణమండపాలలో, మూడుచింతలపల్లి అలియాబాదులోని ఎఆర్కె గార్డెన్ చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, ఒంటరి మహిళ, వితంతు, గీత కార్మికులు, నేతకార్మికులకు అందించే ఆర్థిక చేయూతను ప్రతి నెల పింఛను రూపంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇవే కాకుండా నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేస్తుందన్నారు. ఉచిత బస్సులతో మహిళలందరికీ గౌరవంగా రాష్ట్రమంతా తిరిగేలా అవకాశం కల్పించిందని మహేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు మల్లారెడ్డి, వివేకానందరెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమాం గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, అలియాబాదు మున్సిపల్ చైర్మన్ శిరిషా, మార్కెట్ కమిటీ చైర్మన్ సర్పంహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తితోనే... అపార అవకాశాలు

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



జవహర్‌నగర్. నవంబర్ 18 (సింగిడి): స్వశక్తితోనే అపార అవకాశాలు లభిస్తాయని.... కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడలో బుధవారం నూతనంగా ప్రణవ పెట్రోల్ బంక్ ను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితేనే ఏదైనా సాధించ వచ్చునని ప్రతి మనిషి స్వశక్తితో ఎదిగినప్పుడే అపార అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రణవ పెట్రోల్ బంక్ అధినేతలు బల్లి శ్రీనివాస్, బూరుగు అనిల్, సకిలం మురళి, మధుల స్వయం కృషివల్లే అపారమైన అవకాశాలు లభించాయని తద్వారా పెట్రోల్ బంకులో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో స్వయం ఉపాధి అవకాశాలు వెతుక్కుని మెరుగ్గా రాణించవచ్చునని తెలిపారు." కష్టేఫలి" అని కష్టపడితేనే ఫలితం ఉంటుందని ఈ సూత్రాన్ని బల్లి శ్రీనివాస్ గుప్తా నిజ జీవితంలో తేటతెల్లమైందన్నారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, తాడూరి శ్రీనివాస్, మల్లేష్ గౌడ్, జవహర్ నగర్ మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు రామారావు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, పాండాల యాదగిరి గౌడ్ కార్పొరేటర్లు బల్లి రోజా శ్రీనివాస్ కుతాడి సాయి, గొడుగు వేణు, జమాల్ పూర్ నవీన్ కుమార్, మనోదర్ రెడ్డి, గండి రామచందర్, కృష్ణ గౌడ్, రమేష్,షాంటి వెంకటేష్, గజ్వేల్ శంకర్, నాయకం భాస్కర్, డిఎస్ఎస్ వెంకటేశ్వర్లు, నంగునూరు అశోక్, రేపల్లి శ్రీనివాస్, కృష్ణ పోలాస సాయి, కిరణ్ ,జడల బాలకృష్ణ, బొబ్బిలి మంజుల రజిత గోపాల్ కుతాడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు,బాలికలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (సింగిడి): సంగారెడ్డి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా కేంద్ర ప్రభుత్వ బేటీ బచావో -- బేటీ పడావో పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు బాలికలకు ఉచిత కంప్యూటర్ మరియు టాలీ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

• డి.ఎస్.పి ప్రసన్నకుమార్

సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 18(సింగిడి): క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు అభ్యసించాలని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాలు సేవించడం ద్వారా యువత శారీరకంగా మానసికంగా బలహీనపడటమే కాకుండా వారి జీవిత లక్ష్యాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రతి విద్యార్థి రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల వారి గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నడవడికను అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు క్షుణ్ణంగా



గమనించాలని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మొబైల్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం పట్టణ సీఐ వెంకటయ్యతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ విభాగం సిఐ షీ టీమ్స్ ఎస్సై కళాశాల యాజమాన్యం అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక గుర్తింపు..

ఆలేరు, నవంబర్ 18(సింగిడి): జాతీయ విద్యార్థి సైనిక దళం (ఎన్సీసీ) శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందడమే కాకుండా భవిష్యత్తులో విద్య, ఉద్యోగ రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సీసీ అధికారి దూడల వెంకటేష్, ఆర్మీ అధికారి హవల్దార్ ఉమేష్ కాంబ్లే అన్నారు. విద్యార్థులు ఎన్సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండేళ్ల ఎన్సీసీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెండేళ్ల శిక్షణ



కాలంలో విద్యార్థులకు కవాతు, ఆయుధాల వినియోగం, పటాల పరసం వంటి అంశాలతోపాటు శారీరక, మానసిక వికాసానికి అవసరమైన శిక్షణ అందించినట్లు తెలిపారు. వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జీవన నైపుణ్యాలు పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయుధాల వినియోగం, కాల్పుల శిక్షణ, వ్యక్తిత్వ వికాసం తదితర విభాగాల్లో శిక్షణ పొంది, నిర్దిష్ట పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ ధ్రువపత్రాలను అందజేసినట్లు వివరించారు. ఎన్సీసీ ధ్రువపత్రాలు ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య, వివిధ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా సైన్యం, ఇతర రక్షణ రంగాల్లో చేరాలనుకునే యువతకు ఎన్సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్సీసీ కేవలం శిక్షణకే పరిమితం కాకుండా విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుందని, సమయపాలన, క్రమశిక్షణ, సేవాభావం, దేశం పట్ల అంకితభావం వంటి విలువలను అలవర్చుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఏ సర్టిఫికెట్లు అందుకున్న వారిలో క్యాడెట్లు భార్గవి, భవాని, రేచల్, వర్షిత, సంజయ్, రిత్విక్ తదితరులు ఉన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ఆలేరు విద్యార్థుల పతకాల పంట

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



ఆలేరు, నవంబర్ 18(సింగిడి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఆలేరు మండల విద్యార్థులను ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య ఘనంగా సన్మానించి అభినందించారు. కరాటే మాస్టర్ దర్శనం క్రాంతి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో ఆలేరు మండలానికి చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. బి. భావన, జోయల్ రాజ్, సమీర్, అభిరామ్ రెడ్డి బంగారు పతకాలు సాధించగా, తేజపాల్ రెడ్డి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. హన్సికా, ప్రిన్సీ, ఆదిత్య శరణ్ కాంస్య పతకాలు సాధించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేసి, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. తెలంగాణ బిడ్డలుగా ఆలేరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. చదువుతోపాటు క్రీడల్లోనూ పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు కరాటేలో శిక్షణనిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దిన మాస్టర్ దర్శనం క్రాంతిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయానికి శిక్షకుడి కృషి, నిరంతర సాధన ఎంతో దోహదపడ్డాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ వైస్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎజాజ్, కుల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక భద్రతా పథకాలపై అవగాహన పెంచుకోవాలి



కోదాడ, నవంబర్ 18(సింగిడి): ఆర్థిక సమ్మిళిత శాచురేషన్ కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లెల వెంకట నాగప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ రంజిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల ప్రయోజనాలను వివరించి, అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, అటెండర్ వినోద్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సతీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి): హైదరాబాద్‌లోని బి.ఎన్. రెడ్డి నగర్‌లో గల బి.డి. రెడ్డి గార్డెన్స్‌లో కొల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి కుమారుడు వరుణ్ చందర్ రెడ్డి, కావ్య రెడ్డి వివాహ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీంస్వదించారు. వారు జీవితాంతం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా జీవిస్తూ ఆదర్శ దంపతులుగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు విట్ట శశి వర్ధన్ రెడ్డి, సత్య రెడ్డి, బంధుమిత్రులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది

• వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ, నవంబర్ 18 (సింగిడి): మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జీ ఎం సీ కమిషనర్ వెంకన్న, తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతికి చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సానుకూల మార్పులు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ చేయూత పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రజాప్రతినిధుల చుట్టూ, కార్యాలయాల



చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అధికార యంత్రాంగమే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఒకే రోజు 2,698 మందికి పెన్షన్ల మంజూరు పత్రాలు అందించడం ప్రజాపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించ బడ్డాయని ఎమ్మెల్యే వివరించారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇతర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అర్హులైన మిగతా లబ్ధిదారులకు కూడా దశలవారీగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒకేసారి మంజూరు చేయడం సాధ్యం కాదని, అర్హత ఆధారంగా విడతలవారీగా అందిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధానాన్ని కూడా వివరించారు. పేదల గృహ అవసరాలను తీర్చేందుకు కొత్తగా టవర్స్ నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టామని తెలిపారు. పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి పెన్షన్లు లేదా ఇతర సంక్షేమ పథకాల మంజూరు కోసం ఎవరైనా ఒక్క రూపాయి డిమాండ్ చేసినా సహించేది లేదని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన క్యాంపు కార్యాలయానికి లేదా స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే పెన్షన్లు మంజూరైన వారితో పాటు ఇంకా అర్హత ఉండి పెన్షన్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్యాంపు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం లేదా మున్సిపల్ అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు ఆలస్యమైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల కోసం అనేక దరఖాస్తులు వస్తుంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే పింఛన్లు కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో సహాయకరంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, జడబ్ల్యూఎంస కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఆధునిక సాంకేతికత వినియోగం

• డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ ప్రారంభించిన కమిషనర్ వెంకన్న

• నగరంలోని 66 డివిజన్లలో దశలవారీగా ప్రత్యేక కార్యాచరణ

వరంగల్, నవంబర్18 (సింగిడి): గ్రేటర్ వరంగల్ నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఇందులో భాగంగా దోమల ఉత్పత్తికి ప్రధాన కేంద్రాలుగా ఉన్న నాలాలు, మురుగునీటి ప్రవాహ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ కార్యక్రమాన్ని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న బుధవారం నయీంనగర్‌లోని రాజాజీ నాలా వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ల ద్వారా జరుగుతున్న మందుల



పిచికారీ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. సాధారణంగా పారిశుద్ధ్య సిబ్బంది నేరుగా చేరుకోలేని నాలాల్లోని లోతైన ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో సులభంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో తక్కువ సమయంలో విస్తృత ప్రాంతాల్లో మందుల పిచికారీ చేపట్టడంతో పాటు దోమల ఉత్పత్తిని సమర్థవంతంగా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని 66 డివిజన్ల పరిధిలో దశలవారీగా, ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలను సమన్వయంతో మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, అర్బన్ మలేరియా అధికారి రజిని, సూపర్‌వైజర్ అనిల్, హెల్త్ అసిస్టెంట్లు, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో వనపర్తి భేష్.. 'సురక్షిత్' జిల్లాగా గుర్తింపు

• 95-95-95 లక్ష్యాల సాధనలో మెరుగైన ప్రగతి.. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో వనపర్తికి చోటు

• కలెక్టర్ ఆదర్శ్ సురభిని అభినందించిన డిప్యూటీ డైరెక్టర్ పి.మేఖల

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 18 (సింగిడి): హెచ్ఐవీ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో మెరుగైన ప్రగతి కనబరిచిన వనపర్తి జిల్లాకు 'సురక్షిత్' జిల్లాగా గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంలోని 20 జిల్లాల్లో వనపర్తి చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ పి. మేఖల బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు



చేపడుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని అధికారులకు వివరించారు. 95-95-95 లక్ష్యాల్లో భాగంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి వ్యాధి స్థితిపై అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ సప్రెషన్ సాధించడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో జిల్లాకు గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు. ఈ విజయాన్ని కొనసాగిస్తూ ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సకాలంలో చికిత్సతో పాటు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ గుర్తింపు సాధించడంలో కృషి చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. భాస్కర్ నాయక్‌తో పాటు వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఆర్టీ కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర మోహన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ఐసీటీసీ, ఏఆర్టీ, సిఎస్సీ కేంద్రాల సిబ్బంది, హోప్ ఎన్జీవో ప్రతినిధులు, లింక్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు ఎస్సై ఏడుకొండలు సూచన



కోదాడ, నవంబర్ 18(సింగిడి): విద్యార్థులు సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్సై ఏడుకొండలు సూచించారు. పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండలం గొండ్రియాల జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు నమ్మవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీస్ అక్క సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నూతన ఆడిటోరియం, రీడింగ్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



హన్మకొండ, నవంబర్ 18 (సింగిడి): హనుమకొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియం, రీడింగ్ హాల్‌ను బుధవారం వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన రూ. 97 లక్షల నిధులతో టీ జీ ఈ డబ్యూ ఐ డీ సీ ద్వారా ఈ భవన నిర్మాణ పనులు చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 500 మంది కూర్చునే సామర్థ్యంతో ఆధునిక ఆడిటోరియంను, మొదటి అంతస్తులో 200 మంది పాఠకులకు సరిపడా అధునాతన సౌకర్యాలతో కూడిన రీడింగ్ హాల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నూతన సౌకర్యాలు విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయి. గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసి పాఠకులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఈ నిర్మాణాలు కీలకంగా నిలుస్తాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో ఘనంగా నూతన 'చేయూత' పెన్షన్ పత్రాల పంపిణీ

• లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

• నిరుపేదల ఆర్థిక భద్రతే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడి

రాజేంద్రనగర్, నవంబర్ 18 (సింగిడి): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అర్హులకు నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు స్వయంగా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేదలకు ఈ 'చేయూత' పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాములు, సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు మల్లారెడ్డి (అత్తాపూర్), లక్ష్మారెడ్డి (నార్సింగి), సుమన్ రావు (శంషాబాద్), డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు.



రేపటి నుంచి రైజింగ్ స్టార్స్ ఆసియా కప్..

భారత్-పాక్ సమరం ఎప్పుడంటే?

దోహా: క్రికెట్ అభిమానులను అలరించేందుకు డీపీ వరల్డ్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ సిద్ధమైంది. ఖతార్ రాజధాని దోహా వేదికగా నవంబర్ 19 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ 'ఏ' జట్లతో పాటు హాంకాంగ్ చైనా, నేపాల్, యూఏఈ జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి.

తిలక్ వర్మ సారథ్యంలో భారత్

భారత 'ఏ' జట్టుకు తిలక్ వర్మ నాయకత్వం వహించనున్నాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ వంటి ఆటగాళ్లు జట్టులో ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గతేడాది సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 'ఏ' చేతిలో ఓటమిపాలైన భారత్.. ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్తాన్‌తో నవంబర్ 22న భారత్ తలపడనుంది.

ప్రత్యక్ష ప్రసారం ఎక్కడంటే..

భారత్‌లో ఈ టోర్నీ మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఆన్‌లైన్‌లో సోనీలివ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది.

టోర్నీ షెడ్యూల్ (భారత కాలమానం ప్రకారం)

నవంబర్ 19, గురువారం
బంగ్లాదేశ్ 'ఏ' – హాంకాంగ్: ఉదయం 11:30
శ్రీలంక 'ఏ' – ఆఫ్ఘనిస్తాన్ 'ఏ': మధ్యాహ్నం 3:30
నవంబర్ 20, శుక్రవారం
పాకిస్తాన్ 'ఏ' – యూఏఈ: ఉదయం 11:30
భారత్ 'ఏ' – నేపాల్: మధ్యాహ్నం 3:30
నవంబర్ 21, శనివారం
శ్రీలంక 'ఏ' – హాంకాంగ్: ఉదయం 11:30
బంగ్లాదేశ్ 'ఏ' –ఆఫ్ఘనిస్తాన్ 'ఏ': మధ్యాహ్నం 3:30
నవంబర్ 22, ఆదివారం
యూఏఈ – నేపాల్: ఉదయం 11:30
భారత్ 'ఏ' – పాకిస్తాన్ 'ఏ': మధ్యాహ్నం 3:30
నవంబర్ 23, సోమవారం
ఆఫ్ఘనిస్తాన్ 'ఏ' – హాంకాంగ్: ఉదయం 11:30
శ్రీలంక 'ఏ' –బంగ్లాదేశ్ 'ఏ': మధ్యాహ్నం 3:30
నవంబర్ 24, మంగళవారం
భారత్ 'ఏ' – యూఏఈ: ఉదయం 11:30
పాకిస్తాన్ 'ఏ' – నేపాల్: మధ్యాహ్నం 3:30
సెమీఫైనల్స్, ఫైనల్
తొలి సెమీఫైనల్: నవంబర్ 26, మధ్యాహ్నం 3:30
రెండో సెమీఫైనల్: నవంబర్ 27, మధ్యాహ్నం 3:30
ఫైనల్: నవంబర్ 29, మధ్యాహ్నం 3:30

ధోనీ ఔట్..

ఐపీఎల్ ఆల్ సీజన్ ప్లేయర్లుగా ముగ్గురు!

ఐపీఎల్ చరిత్రలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. లీగ్ ఆరంభం నుంచి ప్రతి సీజన్‌లోనూ బరిలోకి దిగిన ఆటగాళ్ల జాబితా నుంచి మహేంద్రసింగ్ ధోనీ నిష్క్రమించాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించడంతో.. ఇప్పటివరకు అన్ని 19 సీజన్లలోనూ ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లలో ధోనీ పేరు ఇక ఉండదు. దీంతో ఈ అరుదైన ఘనత సాధించిన ఆటగాళ్లుగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మనీశ్ పాండే మిగిలారు.

రెండేళ్లు మినహా సీఎస్‌కేతోనే ప్రయాణం

2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్‌తో అనుబంధం



కొనసాగించాడు. అయితే సీఎస్‌కేపై రెండేళ్ల నిషేధం కారణంగా 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మిగిలిన సీజన్లలో చెన్నై జట్టుకు కీలక ఆటగాడిగా వ్యవహరించాడు. గత సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా జట్టులో కొనసాగాడు.

20వ సీజన్‌పై ముగ్గురి గురి

ధోనీ ఆటగాడిగా తప్పుకోవడంతో ఇప్పుడు కోహ్లీ, రోహిత్, మనీశ్ పాండే 20వ ఐపీఎల్ సీజన్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. 2027 సీజన్ కోసం ఆర్సీబీ కోహ్లీని, ముంబై ఇండియన్స్ రోహిత్ శర్మను, కోల్‌కతా నైట్‌రైడర్స్ మనీశ్ పాండేను తమ జట్లలో కొనసాగించాయి. దీంతో వరుసగా 20 సీజన్లలో ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లుగా ఈ ముగ్గురు చరిత్ర సృష్టించే అవకాశం ఉంది.

అమిత్ షా కొడుకు కే ఐసీసీ పీఠం..

జై షాపై ఆస్ట్రేలియా జర్నలిస్ట్ ఫైర్!







అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ పునర్నియామకంపై ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ గిడియన్ హైగ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. క్రికెట్‌పై సరైన అవగాహన, ప్రత్యేక ప్రతిభ లేని జై షాకు మరోసారి ఐసీసీ పగ్గాలు అప్పగించడం ఏమిటని ప్రశ్నించాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు కావడం వల్లే ఆయనకు ఈ పదవి దక్కిందని ఆరోపించాడు. క్రికెట్ గురించి తెలియని వ్యక్తికి సభ్య దేశాలు మద్దతు పలకడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించాడు.

ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నిక

ఇండోనేషియాలోని బాలిలో జరిగిన ఐసీసీ సమావేశంలో జై షా పేరును చైర్మన్ పదవికి ప్రతిపాదించగా.. సభ్య దేశాల ప్రతినిధుల నుంచి ఏకగ్రీవ ఆమోదం లభించింది. దీంతో ఆయన మరోసారి ఐసీసీ పగ్గాలు చేపట్టనున్నారు. 2024 డిసెంబర్ 1న తొలిసారి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షా.. రెండోసారి ఎన్నిక కావడంతో 2030 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 38 ఏళ్ల వయసులోనే ప్రపంచ క్రికెట్ పాలక సంస్థకు రెండోసారి నాయకత్వం వహించే అవకాశం దక్కించుకున్నారు.

పాక్ మాజీ ఆటగాళ్ల నుంచి కూడా విమర్శలు

జై షా పునర్నియామకంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు సైతం విమర్శలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ చైర్మన్ పదవికి మొహ్సిన్ నఖ్వీ వంటి వారికి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఆసియా క్రికెట్ కౌన్సిల్‌లో నఖ్వీ పదవీకాలం 2027తో ముగియనుండటంతో.. ఆయన స్థానంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్‌కు అవకాశం దక్కవచ్చనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే జై షా రెండోసారి ఎన్నిక కావడంపై వస్తున్న విమర్శలు, ఆరోపణలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

ఒకే రోల్స్ వద్దు

దేవయాని శర్మ



తెలుగు, హిందీ చిత్రాలతో పాటు సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫొటోలతో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న నటి దేవయాని శర్మ. 'సేవ్ ది టైగర్స్', 'సైతాన్' వంటి సంచలన వెబ్ సిరీస్‌లతో ఓవర్ నైట్ స్టార్‌గా ఎదిగిన ఆమె, ఇటీవల 'ఆదర్శ కుటుంబం' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దేవయాని తన సినీ కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇండస్ట్రీలో ఉన్నవారంతా మరింత విశాల దృక్పథంతో ఆలోచించాలని కోరారు. నటీనటులను ఒకే రకమైన పాత్రలకే పరిమితం చేయకుండా, వారు ఎలాంటి పాత్రలైనా పోషించగలరని దర్శక-నిర్మాతలు గ్రహించాలని అన్నారు.

ఒకే జోనర్ లేదా ఒకే రకమైన రోల్స్ చేయడం వల్ల వచ్చే మూస ధోరణిని, విసుగును అధిగమించడానికి ఇదే సరైన మార్గమని అభిప్రాయపడ్డారు. ఇక తెలుగులో ఇప్పటికే పలు ప్రాజెక్ట్‌లు చేసినప్పటికీ, తనలోని నటిని పూర్తిగా తృప్తి పరిచేలా మంచి పాత్రలు రావడం లేదని దేవయాని వాపోయారు. అందుకే కోలీవుడ్ వైపు అడుగులు వేయాలని అనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను తమిళంలో ఎలాంటి సినిమాలు అంగీకరించలేదని, కొన్ని ఆఫర్లు వచ్చినప్పటికీ తనలోని కళాకారిణికి పూర్తి న్యాయం చేసే ఒక బలమైన పాత్ర కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఆమె చెప్పుకొచ్చారు.

త్వరలో పెళ్ళి!

తరుణ్ భాస్కర్-ఈషా రెబ్బా రిలేషన్‌షిప్‌పై అధికారిక ప్రకటన విడుదల



టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వస్తున్న క్రేజీ సీక్వెల్ 'ఈ నగరానికి ఏమైంది రిపీట్'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 19న థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, తాజాగా ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర బృందం ఎంతో గ్రాండ్‌గా నిర్వహించింది. అయితే ఈ వేడుకలో పాల్గొన్న తరుణ్ భాస్కర్ తల్లి గీతా భాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొంతకాలంగా తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఈషా రెబ్బా రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనని ఆమె స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా తమ కుటుంబం, ముఖ్యంగా తరుణ్ భాస్కర్ ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఈ రెండేళ్ల కాలంలో తరుణ్ ఎన్నో ఒడుదుడుకులు చూశాడని, కోర్టు కేసులు, కొత్త ఇల్లు కట్టడం వంటి అనేక సమస్యలతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని ఆమె తెలిపారు. సినిమా పనుల వల్ల అసలు ఇంటికే రాని రోజులు కూడా చాలా ఉన్నాయని చెప్పారు. అయితే అలాంటి కష్టసమయాల్లో, అర్ధరాత్రి 2 గంటలకు, తెల్లవారుజామున 4 గంటలకు తరుణ్ ఇంటికి వచ్చినప్పుడు అతనికి ప్రేమగా భోజనం పెట్టడానికి ఒక మంచి సోల్‌మేట్ దొరికిందని గీతా భాస్కర్ వెల్లడించారు. ఆమె మరెవరో కాదని, మనందరం ఎప్పటినుంచో అనుకుంటున్న ఈషా రెబ్బానే అని ఆమె ఓపెన్‌గా చెప్పేశారు

నేను ఏ డైరెక్టర్‌ను అడగలేదు...

-చిరంజీవి

వెంకీ కుడుముల కామెడీ టైమింగ్ తనకు చాలా ఇష్టమని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఇట్లు అర్జున సక్సెస్ మీట్ లో చిరు మాట్లాడుతూ... తనతో సినిమా



చేయమని ఏ డైరెక్టర్‌ను అడగలేదని కానీ వెంకీని అడిగానని చెప్పారు. మంచి కథతో వస్తానని చెప్పి ఇప్పటి వరకు రాలేదని, ఇప్పుడు ప్రొడ్యూసర్ అవతారం ఎత్తాడన్నారు. ఇప్పుడు కూడా తనతో కాకుండా యంగ్ హీరోలతోనే నిర్మాతగా సినిమాలు చేస్తున్నాడని చెప్పారు. ఇకపై వెంకీ వచ్చినా తన ఇంటిగేట్లు మూసి ఉంటాయని సరదాగా అన్నారు. అంతేకాకుండా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఎక్కడికి వెళ్లినా కాక సినిమా గురించి మాట్లాడుతున్నాడని పబ్లిసిటీ కొంచెం తగ్గించాలన్నారు. తమన్ అలా మాట్లాడితే మిగితావాళ్లు తమ సినిమా గురించి చెప్పట్లేదని ఫీల్ అవుతారని వ్యాఖ్యానించారు. కానీ తమన్ చెప్పేది నిజమేనని, కాకతో ఈసారి కచ్చితంగా కొట్టబోతున్నామన్నారు. ఇట్లు అర్జునకు ఇంతమంది సపోర్ట్ చేయడం హీరో అనీష్ చేసుకున్న అదృష్టం అని అన్నారు. అనీష్‌కు ఇంత సపోర్ట్ చేయడానికి ఆయన తండ్రి ఏఎంఆర్ మహేశ్ రెడ్డి అని చెప్పారు. ఆయన ఎంతపెద్ద మైనింగ్ డాన్ అయినా సినిమా పట్ల ఆయనకు ఉన్న ఆసక్తితోనే ఇంతమంది సపోర్ట్ చేశారన్నారు.:

క్రేజీ లవ్ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్న మమితా బైజు..



'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ నేషనల్ క్రష్‌గా మారిపోయి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేసిన మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఈ యంగ్ సెన్సేషన్, ఇప్పుడు మరో ఆసక్తికరమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. మమితా బైజు, సంగీత్ ప్రతాప్ జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హలో డియర్'. రచయిత డినోయ్ పౌలోస్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి.. తాజాగా, మమిత బైజు కొత్త పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు రిలీజ్ డేట్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 29న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

సిన్మా Cinma Singidi

గురువారం
19-11-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737